ఆదివారం
ప్రజాశక్తి
జూన్ 1, 2003



ధరణికి తాపం

నరునికి శాపం

హ్యాపీ బర్త్‌డే (1-6-2003 నుండి 7-6-2003 వరకు)

పండు
2సం॥, 01.06.2001
రమ, ఉమామహేశ్వర్
హైదరాబాద్

సాయి యశోద
జూన్ 1
వి.సత్యవతి-వి.బాబూరావు
సాలేరు-నిజామాబాద్

ఎస్.కె.ఆరీఫా (ఆషు)
2సం॥, 01.06.2001
రహిమా బేగం-మీరాహుస్సేన్
ఖమ్మం

షేక్ ఖాజా రూహిన్
2సం॥, 01.06.2001
నజియా సుల్తానా-ఖాజా రహంతుల్లా
మొగళ్ళూరు-ప్రకాశం

కొదుమూరి పృధ్వీ
2.6.1998
సుధ-శ్రీనివాస్
మహబూబాబాద్-వరంగల్

తిప్పారపు శివాజిపాటిల్
1సం॥, 02.06.2002
కళ్యాణి-విజయేందర్
మందమర్రి-ఆదిలాబాద్

ఇంజమామ్-ఉల్-షరీఫ్
04.06.1999
షాహీన్ సుల్తానా-ఎం.డి.హాసన్‌షరీఫ్
మౌలాలి- హైదరాబాద్

బి.కావ్య
05.06.1998
జ్యోతి-రవీంద్రనాథ్
నార్నెపాడు-గుంటూరు

ఆర్.కావ్య
1సం॥, 06.06.2003
అనూరాధ-ప్రవీణ్‌కుమార్
శేరిలింగంపల్లి-రంగారెడ్డి



సుహాస్ గుమ్మడి
06.06.2003
సుకన్య- రామకిషోర్
హైదరాబాద్

ఒగ్గు అఖిల్ శ్రీనివాస్
02.06.2003
ప్రవీణ- ఆదిత్య
ధవళేశ్వరం, తూ॥గో॥

ఉదయ్ భాస్కర్
02.06.2000
మాధవి-రాము
కోడూరు-కృష్ణా

సంజయ్ రాజ్ (బన్ని)
01.06.2003
మమత-మల్లేష్
అడ్డగుట్ట - సికింద్రాబాద్

కాసర్ల రోహిత్‌రెడ్డి
మే 2002
విజయకుమారి - నర్సిరెడ్డి
నల్గొండ

పల్లె ప్రణయ్ కుమార్
మే-2002
పల్లె సరళ-శేఖర్‌రెడ్డి
లింగంవారిగూడెం-నల్లగొండ

హేమంత్‌కుమార్
మే 1998
స్వరూప-కృష్ణ
ఓల్డ్‌బోయిన్‌పల్లి-సికింద్రాబాద్

మనలో మాట

బుజ్జగించుకోండి!

మనం మూర్ఖ శిఖామణులం కాదు.

అంతో ఇంతో మెదడున్న వాళ్ళమే!

మంచీచెడూ మనకూడా తెలుసు. ఈ వ్యక్తిత్వ గురించి మనకెవరూ లెక్చర్లివ్వకపోయినా ఫర్లేదు!

తెలీక చేసిన తప్పు విడిచి పెట్టండి.

ఏదో చూసి ఏదో అనుకుని ఏదో చేసి ఏదో అయిపోతాం!

తెలీక చేసిన తప్పు గనక - అవతలి వాళ్ళు అయ్యోపాపమని జాలిపడితే పడొచ్చుగానీ క్లాసులు పీకరు! ఇకముందు జాగ్రత్తపడమని హెచ్చరిస్తారు!

కొన్ని తప్పులు తెలిసి కూడా చేస్తాం. ఖర్మ కాలిపోతే పట్టుబడతాం! లక్కు బావుంటే గుట్టుగా పడి వుంటాం!

తప్పు చేసి పట్టుబడినప్పుడు - క్లాసులు పీకేందుకు అగ్నిహోత్రావధానులు కొందరు మనముందుకొచ్చేస్తారు. వత్సా అని పలకరిస్తారు. నీతి పద్యాలు చదువుతారు. నీతిగా బతకమని శాపం పెట్టి వెళ్ళిపోతారు!

ఆ మాటకొస్తే-

క్లాసులు పీకే అగ్నిహోత్రావధానులందరూ కారణజన్ములని భావించడం బుద్ధి తక్కువపని!

సదరు కారణ జన్ములు సైతం ఎప్పుడో ఒకప్పుడు కాలు జారిన వాళ్ళే!

మనం చేసిన తప్పు వెలుగులోకి రాగానే - తమ తప్పులు మరిచిపోతారు. పట్టు వస్త్రాలు కట్టుకుని, విభూతి రేఖలు దిద్దుకుని మనముందు ప్రత్యక్షమవుతారు!

సుభాషితాలు ఓపిక ఉన్నంత వరకు చదివి తాత్పర్యాలు చెప్పి బాగుపడమని సలహా ఇచ్చి నిష్క్రమిస్తారు!

తప్పు చేయవద్దని చెప్పేవాడు - తప్పు చేయని వాడని భావిస్తే పెద్ద తప్పే అవుతుంది!

మనిషై పుట్టేక తప్పు చేయడం తప్పనిసరి!

ఈ సూత్రానికి మినహాయింపు లేనే లేదు!

ఏ తప్పూ చేయని వాడు ఏసు ప్రభువవుతాడు! ఎప్పుడో ఒకప్పుడు శిలువ ఎక్కుతాడు! వదిలేయండి!

నేను నిప్పు. అవతలివాడు బురద పులుముకున్న చెప్పు అని ఎవడికి వాడు ఎప్పటికప్పుడు తనని తాను బుజ్జగించుకుని తృప్తి పడకపోతే సుఖపడలేడు!

ఓట్ల సీజను ముంచుకొస్తోంది గదా! రాజకీయం ఊపందుకుంటుంది. అందులో ఒక భాగంగా - ఈ బుజ్జగింపు భాగోతం పేపర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి! గమనించండి!

◆

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం . . . 2
కవర్‌స్టోరీ . . . 3
ఆరోగ్యం . . . 6
జీవనశైలి . . . 8
సినిమాలహరి . . . 9
బాలల కథ . . . 11
వ్యాఖ్యాస్త్రాలు . . . 12
కవిత . . . 14
టూరిస్ట్‌గైడ్ . . . 16
క్రీడారంగం . . . 17
పుస్తక పరిచయం . . . 20
కళాభారతి . . . 21
పలకండి 24
వగైరా . . . .

ఇంకా...

సెలవుల్ని సద్వినియోగం చేసుకోవాలి
బాలవికాసం . . 10



ఇంటింటా నాటకం..
'ఇంతి' సంగతులు . . . 15

నిర్ణయం
కథ . . . 18, 19

గోరంత దీపం
రియల్‌స్టోరీ
. . .22


'అత్యవసర' కారణంగా
సంస్కరణల కార్యక్రమం కాసేపు
పక్కన పెట్టి సంక్షేమ పథకాలు
అనే నాటకాన్ని ప్రసారం
చేస్తున్నాం..!


STOP
ఢిల్లీ - లాహూర్
రండి బాబూ రండి
ఎన్నికల స్పెషల్!

గుజరాత్
శవపేటికలు
యుటిఐ
పెట్రోల్
భూకబ్జాలు
మా అభివృద్ధే
మమ్మల్ని...
గెలిపిస్తుంది



ధరణికి తాపం నరునికి శాపం

* ఎస్. వెంకట్రావు

ఎండలు ఈ ఏడాది చాలా ఎక్కువగా ఉన్నాయి.... ఏనాడూ లేంది ఈ ఏడేమిటి వడదెబ్బకు ఇంతమంది చనిపోయారు!.... కాలంకాని కాలంలో ఈ వర్షాలు, వరదలు వేెం ఎరుగమమ్మా....ఏమిటో ఒక వైపు దుర్భిక్షం మరోవైపు వరదలు, అంతా వింతగా ఉంది......

ఇటీవలి కాలంలో కాస్త పాతతరం వ్యక్తులను వాతవరణం గురించి కదిలిస్తే వారినుండి తరచూ ఇటువంటి మాటలు రావడం గమనిస్తాం. అనుభవంతో వారు చెబుతున్న మాటల్లో కొద్దోగొప్పో నిజం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారు.

అమెరికాలోని ఆషెవిల్లె నేషనల్ క్లైమాటిక్ డేటా సెంటర్ అందించిన వివరాల ప్రకారం గత ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 120 డిగ్రీల ఫారిన్ హీట్ (48.9 డిగ్రీల సెలియస్) ఉష్ణోగ్రత రికార్డయింది. ఫలితంగా ఒక్కవారంలో రికార్డు స్థాయిలో వడదెబ్బ మరణాలు సంభవించాయి. నిజానికి గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వడదెబ్బ మృతుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. అయితే దురదృష్టమేమిటంటే మన ప్రభుత్వం వద్ద సరైన అధికార సమాచారం ఉండదు. ఉన్నా అనేక సందర్భాల్లో వడదెబ్బ మరణాలను ప్రభుత్వం అంగీకరించదు. అందువల్ల ఆ లెక్కలు తప్పులతడకగా ఉంటాయి. ఆసియాలో క్రమంగా వాతావరణం వేడెక్కుతున్న ఫలితంగానే ఆంధ్రప్రదేశ్‌లోగాని, దేశంలోని ఇతర ప్రాంతాల్లోగాని వడగాడ్పులు ఎక్కువవుతున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భారత దేశంలో శతాబ్దానికి 1 ఫారిన్ హీట్ (0.6 సెలిషియస్) డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత పెరుగుతోందని వారు పేర్కొంటున్నారు. ఓస్ వందేళ్లకు ఒక్క డిగ్రీనా అనుకోకండి! సగటున ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుదల మనం నివసించే ఈ భూగోళం మీద అనేక మార్పులు తెస్తుంది. మండే ఎండలు, అకాల వర్షాలు, విపరీతమైన వరదలు, తీరాన్ని తినేసే సముద్రాలు, రకరకాలుగా ప్రబలే వ్యాధులు, మంచులేని హిమాలయాలు, దారులు మార్చే నదులు, ఎండిపోయే అడవులు......ఇవన్నీ కూడా వాతావరణం వేడెక్కడం వల్ల వస్తున్న ఉపద్రవాలే. ఇటీవలి కాలంలో మన భూగోళం మీద ఇటువంటి ఉపద్రవాలు తరచుగా సంభవించడానికీ, భూమి మీద వాతావరణం వేగంగా వేడెక్కడానికీ మధ్య సంబంధం ఉందని శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెబుతున్నారు. ఈ రకంగా వాతావరణం వేడెక్కడాన్నే 'గ్లోబల్ వార్మింగ్' అంటున్నారు. 'గ్రీన్ హౌస్' ప్రభావం వల్ల భూవాతావరణం వేడెక్కుతోందని చెబుతున్నారు. 'గ్రీన్ హౌస్' ప్రభావం దాని వల్ల సంభవించే 'గ్లోబల్ వార్మింగ్' కథేంటో కమామీషేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

గ్రీన్ హౌస్ ప్రభావం

'గ్రీన్ హౌస్' అనేది మనలాంటి ఉష్ణ దేశస్తులకు పెద్దగా అనుభవం లేని విషయం. శీతల ప్రదేశాల్లో పంటలు పండడానికి తగిన వేడిమి లేని ప్రాంతాల్లో ప్రజలు అద్దాల ఇల్లు కట్టి అందులో కూరగాయలు, పూలు వగైరా మొక్కలు పెంచుతారు. సూర్యుని వేడి అద్దాలగుండా లోపలికి వస్తుందిగాని

బయటకు పోయేప్పుడు అంతా పోకుండా కొంత వేడిని అద్దాలు అడ్డుకుంటాయి. అందువల్ల 'గ్రీన్ హౌస్'లలో వేడిగా ఉండి మొక్కలు పెరుగుతాయి. ఇదే రకమైన ప్రక్రియ మన భూగోళం మీద నిత్యం జరుగుతుంటుంది. అద్దాల పనిని భూమ్మీద వాతావరణంలోని వాయువులు, తేమ చేస్తాయి. సూర్యుని నుండి వచ్చే వెలుతురు, వేడి తిరిగి అంతరిక్షంలోకి వెళ్లిపోకుండా భూమి చుట్టూ ఆవరించి ఉండే వాయువులు ఆపుతాయి. వీటినే 'గ్రీన్ హౌస్ వాయువులు' అంటారు. వాతావరణంలోని తేమ, కార్బన్ డై ఆక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, మీథేన్ వంటి వాటిని 'గ్రీన్ హౌస్ వాయువులు' అంటారు. అంటే ఈ వాయువులు సూర్యరశ్మి తప్పుకుని అంతరిక్షంలోకి



వేగంగా మారిపోయే వాతావరణం

వెళ్లిపోకుండా అడ్డుకుంటాయన్నమాట. దానివల్ల వాతావరణంలో వేడి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియ గ్రీన్ హౌస్ ప్రక్రియను పోలి ఉంటుంది గనుక దీన్ని 'గ్రీన్ హౌస్ ప్రభావం' అంటారు. నిజానికి గ్రీన్ హౌస్ ప్రభావం ఉండబట్టే ఈనాడు భూగోళం ఈ విధంగా మానవ నివాస యోగ్యంగా ఉంది. ఎందుకంటే గ్రీన్ హౌస్ ప్రభావం లేకపోతే – సూర్యుని వేడి అంతా అంతరిక్షంలోకి వెళ్లిపోతే – భూమిమీద ఉష్ణోగ్రత పూర్తిగా తగ్గిపోయి మనదీ ఒక మంచు గ్రహంగా మారేను. అప్పుడు ఇక్కడ మానవమాత్రులు నివసించడానికి అవకాశం ఉండకపోయేను. కాని ఈ నాడు మనకు తెలిసి ఈ విశ్వంలో మానవ నివాసానికి అనువైన ఏకైక గ్రహంగా భూమి ఉందంటే దానికి కారణం ఈ 'గ్రీన్ హౌస్' ప్రభావమే. అయితే ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్నదంతా గ్రీన్ హౌస్' ప్రభావం ఎక్కువైపోతే ఏమిటి అన్నదాని గురించే. వాతావరణంలో 'గ్రీన్ హౌస్' వాయువులు ఎక్కువైపోతే అప్పుడు భూమినుండి ఉష్ణోగ్రత పారిపోకుండా ఈ వాయువులు మరింతగా అడ్డుకుంటాయి. ఫలితంగా భూమి ఉష్ణోగ్రత పెరుతుంది. గత శతాబ్ది కాలంలో భూమి యొక్క సగటు ఉష్ణోగ్రత ఒక్క డిగ్రీ ఫారిన్ హీట్ పెరిగిందని అంచనా వేస్తున్నారు. అంటే వందేళ్ల క్రితం వేసవికన్నా ఈ నాటి వేసవి సగటున ఒక డిగ్రీ ఎక్కువన్నమాట. ఒక డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల భూమ్మీద అనేక మార్పులు వస్తాయి.



గ్రీన్‌హౌస్ వినాశనకారులు

ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల ధృవాల్లో మంచు కరిగి సముద్ర నీటిమట్టం పెరుగుతుంది. ఒక అంచనా ప్రకారం గత వందేళ్లలో సగటు ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల సముద్రనీటి సగటు మట్టం 4 నుండి 10 అంగుళాలు పెరిగింది. గ్రీన్ హౌస్ వాయువులు ఇలాగే పెరుగుతూ పోతే రానున్న వందేళ్లలో సముద్రమట్టం మరో మూడు అడుగులు పెరుగుతుందని అంచనా. సముద్రనీటి మట్టం పెరగడమంటే కోస్తాలోని అనేక లోతట్టు ప్రాంతాలు సముద్రం పాలు కావడమే. ఇప్పుడు ప్రపంచ వ్యాపితంగా ఈ ప్రక్రియ చాలా వేగంగా జరుగుతోంది.

రెండవది ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల మంచుకొండలు, ధృవప్రాంతాల్లోని హిమపాతాలు (గ్లేసియర్స్) కరిగిపోయి నదులకు వరదలు పెరుగుతాయి. 1970 నుండి గ్లోబల్ వార్మింగ్ వల్ల హిమాలయాల్లో ఉష్ణోగ్రత 1.8 డిగ్రీల ఫారిన్ హీట్ (1 డిగ్రీ సెలిషియస్) పెరిగిందని ఐక్యరాజ్యసమితి వాతావరణ కార్యక్రమం తరపున హిమాలయాల్లో పరిశోధన జరిపిన పర్వతారోహక శాస్త్రవేత్తలు వెల్లడించారు. పెరిగిన ఉష్ణోగ్రత వల్ల హిమాలయాల్లోని అనేక హిమపాతాలు వెనక్కు పోతున్నాయని వారు తెలిపారు. ఉదాహరణకు ఎవరెస్టు శిఖర మార్గంలో ఉన్న 'కుంభ హిమపాతం' అయిదు కిలోమీటర్లు వెనక్కు వెళ్లిపోయింది. అలాగే హిమాలయాల్లోని దోక్రియాని బార్నాక్ హిమపాతం 1998 శీతాకాలంలోకూడా 66 అడుగులు వెనక్కు వెళ్లిపోయింది. గంగోత్రి హిమపాతం ఏడాదికి 98 అడుగులు చొప్పున వెనక్కుపోతోంది. ఈ లెక్కన 2035 నాటికి మధ్య, తూర్పు హిమాలయాల్లోని హిమపాతాలన్నీ కరిగిపోయి అదృశ్యమవుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ మంచు అంతా కరిగి నదులను వరదల్లో ముంచెత్తుతుంది. వీటివల్ల అకాలమైన వరదలు సంభవిస్తుంటాయి. ఇటువంటి ఉపద్రవాలే ప్రపంచ వ్యాపితంగా సంభవిస్తున్నాయి. ఉదాహరణకు అతిశీతల ప్రాంతమైన ఐస్‌లాండ్‌లో హిమపాతాలు క్రమంగా వెనక్కు పోతున్నాయని, అక్కడ మంచుకరిగిపోతోందని నిపుణులు చెబుతున్నారు. ఇలా కరిగిన మంచంతా సముద్రంలో చేరి దాని నీటి మట్టం పెరగడం వల్ల చాలా వైపరీత్యాలు సంభవిస్తాయి.

గ్లోబల్ వార్మింగ్ వల్ల సముద్రమట్టం పెరగడమే కాదు, భూ వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తాయి. ముఖ్యంగా భూమిమీద 'జల చక్రం' (వాటర్ సైకిల్), 'కర్బన చక్రం' (కార్బన్ సైకిల్), 'జీవజాల చక్రం' (సైకిల్ ఆఫ్ లివింగ్ ఆర్గనిజమ్స్) దెబ్బతినిపోతాయి. వీటి వల్ల వర్షాలు, రుతుపవనాల్లో మార్పులు వస్తాయి. పచ్చగా ఉండే ప్రాంతాలు ఎడారులుగా మారుతాయి. ఆకస్మిక వరదలు, దుర్భిక్షం వ్యవసాయంపై పెద్ద ప్రభావం చూపుతుంది. ఫలితంగా ప్రజల ఆహార భద్రతకే ప్రమాదం వస్తుంది. అడవులు క్షీణించి అనేక రకాల మొక్కలు, జంతు జాతులు నశించిపోతాయి. వీటన్నిటి ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం మానవుని జీవితంపై ఎంతగానో ఉంటుంది. ప్రస్తుతం మనం అనుభవిస్తున్న అతి ఎండలు, అతి వర్షాలు వరదలు, అతిగా వస్తున్న కరువు కాటకాలు



వాతావరణంలో సంభవిస్తున్న మార్పులకు సూచికలనీ వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువులు పెరిగిపోతున్న కొద్దీ ఈ దుష్ప్రభావాలు మరింత ఎక్కువగా ఉంటాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

గ్లోబల్ వార్మింగ్ ప్రభావం మనిషి ఆరోగ్యం

మీదకూడా చాలా తీవ్రంగానే ఉంటుంది. ఉదాహరణకు వడగాడ్పుల వల్ల చనిపోతున్న వారి సంఖ్య మన రాష్ట్రంలో చూసుకున్నా, దేశవ్యాపితంగా చూసుకున్నా ఏటేటా పెరుగుతున్నది. చలి, వేడి వంటి ప్రకృతి వైపరీత్యాలతో ప్రజలు ఎక్కువగా మరణించడానికి పెరుగుతున్న పేదరికం, ఆర్థిక అంతరాలు కూడా ఒక కారణమే. వాతావరణంలోకి వచ్చే ప్రమాదకర కర్బన మిశ్రమ వాయువుల వల్ల ప్రజల ఆరోగ్యం చెడిపోవడమే కాదు, గ్లోబల్ వార్మింగ్ మూలంగా అనేక రకాల బాక్టీరియా విజృంభించి అనేక వ్యాధులు కలుగ జేస్తున్నాయి. మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు పెరిగి కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి.

కారణాలేమిటి?

గ్లోబల్ వార్మింగ్‌కు 'గ్రీన్ హౌస్ వాయువులు' కారణమనుకున్నాం. మరి ఈ గ్రీన్ హౌస్ వాయువులు వాతావరణంలో పెరగడానికి కారణం ఏమిటి? మానవుని కార్యకలాపాలే దీనికి కారణం. పారిశ్రామిక విప్లవ కాలానికి ముందు వరకు భూమ్మీద వాతావరణ మార్పులు సహజసిద్ధంగా సంభవిస్తుండేవి. కాని పారిశ్రామిక విప్లవ కాలంనుండి మనిషి సాధించిన సాంకేతికాభివృద్ధి అతని చేత రానురాను మరింతగా ఇంధనాలు ఉపయోగింపజేస్తోంది. బొగ్గు, చమురు వంటి ఇంధనాలు మండించేటప్పుడు వెలువడే కార్బన్ డై ఆక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, మీథేన్ వంటి వాయువులు వాతావరణంలో ఎక్కువగా చేరడమే నేడు మనకు వస్తున్న ఈ తిప్పలకు కారణం. మానవులు ఉపయోగించిన చెత్తా చెదారం గుట్టలనుండి మీథేన్ వాయువు ఎక్కువగా వెలువడుతుంది. విద్యుదుత్పత్తికిగాని, పారిశ్రామికావసరాలకు గాని బొగ్గును మండించినప్పుడు వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ వాయువు శాతం పెరుగుతుంది. కార్బన్ డై ఆక్సైడ్ వాయువును పీల్చుకుని ఆహారాన్ని తయారు చేసుకునే మొక్కలు, వృక్ష సంపదను నాశనం చేసినప్పుడు కూడా వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ వాయువు శాతం పెరుగుతుంది. కార్లు, బస్సులు, ఇతర మోటారు వాహనాలకు పెట్రోలియం ఉత్పత్తులు ఉపయోగించినప్పుడు వాతావరణంలో నైట్రస్ ఆక్సైడ్ శాతం పెరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మనం చేసే ప్రతి పనీ, మనం దైనందిన జీవితంలో ఉపయోగించే ప్రతి కృత్రిమ వస్తువూ వాతావరణంలోకి గ్రీన్ హౌస్ వాయువులను విడుదల చేస్తాయి. మీరుకూడా వాతావరణంలోకి గ్రీన్ హౌస్ వాయువులు విడుదల చేస్తున్నారా? లేదా....? తెలీదా....! అయితే మీరు ఈ క్రింది పనులు చేస్తున్నారేమో ఒక సారి యోచించండి?

టివి చూస్తున్నారా?
లైట్ వేస్తున్నారా?
హెయిర్ డ్రై ఉపయోగిస్తున్నారా?
మోటారు వాహనంపై ప్రయాణం చేస్తున్నారా?
వీడియోగేమ్ ఆడుతున్నారా?
స్టీరియో వింటున్నారా?

ఇవన్నీకూడా వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువులు పెంచేవే. వీటిని నివారించడం ద్వారా మనం గ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావం నుండి, తద్వారా గ్లోబల్ వార్మింగ్‌నుండి మానవాళిని రక్షించగలం గాని ఇవి వాడకపోతే అసలు ఆధునికజీవితం అనేదానికి అర్థమే ఉండదు కదా! అయితే ఆధునికయుగంలో వీటన్నిటికన్నా ఎక్కువ ప్రభావం చూపిస్తున్న కొన్ని రంగాలను అదుపు చేయగలిగితే ఈ ప్రమాదం నుండి ప్రపంచాన్ని బయట పడేయవచ్చు. వాటిలో మోటారు వెహికిల్ రంగం ముఖ్యమైనది. అనవసరమైన విలాస వస్తువుల వాడకాన్ని తగ్గించడం ద్వారా, వ్యక్తిగత ప్రయివేటు వినియోగం స్థానంలో సమిష్టి, పబ్లిక్ వినియోగాన్ని పెంచడం ద్వారా గ్రీన్ హౌస్ వాయువుల ప్రభావం నుండి, గ్లోబల్ వార్మింగ్ ప్రమాదం నుండి ప్రపంచాన్ని రక్షించ వచ్చు. అయితే దీనికి గాను ప్రభుత్వాల విధానాల్లోనే మార్పు రావాలి. ఉదాహరణకు ప్రపంచ ప్రజలంతా వినియోగించే ఇంధనంలో నాలుగో వంతు ఇంధనాన్ని ప్రపంచ జనాభాలో ఆరోవంతుకూడా లేని అమెరికా వినియోగిస్తోంది. అక్కడి ప్రజల విలాస జీవనమే దీనికి కారణం. అక్కడ ఫోర్డు వంటి ప్రయివేటు కార్ల కంపెనీల లాబీ దేశంలోని పబ్లిక్ రవాణా రంగాన్ని నాశనం చేసింది. దాంతో యాభైమంది ప్రయాణించే బస్సు, వేలాదిమంది ప్రయాణించే రైళ్ల స్థానంలో వ్యక్తిగత కార్లు, విమానాల సంఖ్య బాగా పెరిగింది. ఇవి రెండూ ఇంధనాన్ని బాగా ఉపయోగిస్తాయి. అంతేకాదు అమెరికన్ల విలాసాలలో ఎయిర్ కండిషన్లు, ఫ్రిజ్‌లు, ఓవెన్లు వంటి వాటి వినియోగం చాలా ఎక్కువ. ఫలితంగా ప్రపంచంలోని గ్రీన్ హౌస్ వాయువుల్లో నాలుగో వంతుకు పైగా ఒక్క అమెరికానే విడుదల చేస్తోంది. అయితే గ్లోబల్ వార్మింగ్‌కు కారణమయ్యే ఈ వాయువులను అరికట్టేందుకు ముందుకు రావాలని, దీనికి గాను కొన్ని నిబంధనలు పాటించాలని జపాన్‌లోని క్యోటోలో జరిగిన సదస్సు పిలుపునిస్తే అమెరికా మాత్రం దానికి ఒప్పుకోకుండా మోకాలడ్డింది. అంతేకాదు వాతావరణ కాలుష్య నివారణకోసం తమ జాతీయాదాయంలో చాలా చిన్న భాగాన్ని ఖర్చుచేయాలని ధరిత్రీ సదస్సు ఇచ్చిన పిలుపును కూడా అమెరికా లెక్క చేయలేదు. అందువల్ల ఈనాడు ప్రపంచ ఇంధనంలో అత్యధిక భాగం వినియోగిస్తున్న అమెరికా గాని, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు గాని గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన బాధ్యత వహించాల్సి ఉంటుంది. అయితే ఈ దేశాల తరహాలోనే మన దేశంలోనూ ఇప్పుడు వ్యక్తిగత కార్లు, మోటారు వాహనాలు, వంటి వాటి వాడకం పెరుగుతోంది, ఆర్టీసి, రైల్వే వంటి పబ్లిక్ రవాణాను ప్రభుత్వాలే ఒక పథకం ప్రకారం నాశనం చేస్తున్నాయి.



భారత్, చైనా వంటి అత్యధిక జనాభాగల దేశాల్లో కూడా పబ్లిక్ రవాణాను, పబ్లిక్ వినియోగాన్ని నాశనం చేసి వ్యక్తిగత విలాస వినియోగాన్ని పెంపొందిస్తే గ్లోబల్ వార్మింగ్ ప్రభావం మరింత పెరుగుతుంది. దాని వల్ల ఎప్పుడో వస్తాయనుకున్న ఉపద్రవాలు ఇప్పుడే వచ్చే అవకాశముంది. ఇదంతా జడిపించడానికి చెబుతున్నది కాదు, ఇప్పుడు సంభవిస్తున్న కరువు కాటకాలు, అకాల వర్షాలు వరదలు, భరించలేని వడగాడ్పులు మరోవైపు అత్యధిక మంచుకురవడాలూ పరిశీలించి వాటివెనుక వాస్తవాలు వెలికి తీస్తే మనం ఎంతజాగ్రత్తగా ఉండాలో అర్థమవుతుంది. గ్రీన్ హౌస్ వాయువుల ప్రభావం, గ్లోబల్ వార్మింగ్ ప్రమాదంగురించి వాటికి కారణమైన ఆర్థిక, సామాజిక, భౌగోళిక కారణాల గురించి ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా మాత్రమే ఈ ఉపద్రవం నుండి ప్రపంచాన్ని రక్షించగలం. ◆



చెవుడుకు కారణాలెన్నో...

* డా॥ ఎం.వి.సమద్

మాట్లాడే శక్తి మానవునికి లభించిన అద్భుతమైన వరం. మానవుడు వినికిడి శక్తి వలన బాహ్య ప్రపంచంతో మాట్లాడగలుగుతున్నాడు. ఈ కారణం వల్లనే మానవుని సృష్టి అన్ని జీవరాసుల సృష్టికంటే అద్భుతమైనది. వినికిడి శక్తి లేకపోతే మాట్లాడే శక్తి కోల్పోవడం జరుగుతుంది. దీనివలన మానసిక వికాసానికి అవరోధం కలుగుతుంది. అందువలన వినికిడిలో తేడా అనిపిస్తే ఇ.ఎన్.టి. వైద్య నిపుణులను కలవడం వలన చెవుడును ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు. అలాగే చిన్న పిల్లలలో చెవుడును గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

చెవుడు రెండు రకాలు (1) శబ్దం చెవిలోకి చేరకపోవడం. దానిని కండక్టివ్ డెఫ్‌నెస్ (Conductive Deafness)అని (2) వినికిడి నరం గ్రహించలేకపోవడం దానిని సెన్సరీ న్యూరల్ డెఫ్‌నెస్ అని అంటారు. (Sensory Neural Deafness) శబ్దము చెవిలోకి చేరకపోవడానికి అతి ముఖ్యమైన కారణం బయట చెవి సరిగా ఎదగకపోవడం, గుబిలి గట్టిపడి వుండిపోవడం వగైరా. అలాగే మధ్య చెవిలో ఎముకలు గట్టిపడిపోవడం వలన కూడా వినికిడి లోపం ఏర్పడుతుంది. దీని ఓటో స్కెలరోసిస్ అంటారు. వినికిడి నరం దెబ్బతినడానికి కారణాలు శబ్దకాలుష్యం, రక్తసంబంధీకుల వివాహాలు, అధికంగా ధూమపానం, మద్యపానం అలాగే కొన్ని రకాల మందులు ఎక్కువ మోతాదులో తీసుకోవడం వలన (ఉదా : Streptomycin, asprine, quinine) చెవిలో నరాలు దెబ్బతిని చెవుడు వచ్చే అవకాశం ఉంది.

పిల్లలలో చెవుడు రావడానికి కారణాలు

తల్లి గర్భంలో ఉన్నప్పుడు తల్లివాడే మందుల వలన, పుట్టిన తరువాత పొంగు, కామెర్లు మొదలైనవి రావడం వలన, ప్రసవించే సమయం కన్నా ముందుగా ప్రసవించడం వలన (Prematurity), అలాగే ప్రసవించే సమయంలో ఆక్సిజన్ లేకపోవడం వలన (Hypoxia), గౌదబిళ్ళలు మొదలైన వాటి వలన పిల్లలలో వినికిడి నరం దెబ్బతిని చెవుడు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే పూసలు, బలపాలు, పెన్సిళ్ళు పెట్టుకోవడం వలన కర్ణభేరి దెబ్బతిని చెవుడు వస్తుంది. మధ్యచెవిలో చీము పట్టడం వలన కూడా చెవుడు వస్తుంది. ఇలా చెవుడు వచ్చిన వారు ఇ.ఎన్.టి. వైద్య నిపుణులచే పరీక్షించుకోవడం వలన వారిలో చెవుడు ఎంత శాతం ఉందో గుర్తించవచ్చు. ఆడిమోమీటర్, టింఫనోమీటర్‌ల ద్వారా పరీక్షించి వినికిడి లోపం గుర్తించవచ్చు. బయట చెవి, మధ్య చెవి కారణాలలో ముఖ్యంగా గుబిలి, పూసలు, బలపాలు, వగైరా నిపుణుని పర్యవేక్షణలో తీయించడం వలన వినికిడిని తిరిగి పొందగలుగుతారు. ఓటో స్కెలరోసిస్ వ్యాధికి గురైన వారు ఆపరేషన్ ద్వారా వినికిడిని తిరిగి పొందవచ్చు.

వినికిడి నరం గ్రహించకపోవడానికి కారణాలు

లోపల చెవిలో గల కాక్లియా దెబ్బతినడం వలన జరుగుతుంది. ఇలా దెబ్బతినడాన్ని ఆడియో మీటర్ ద్వారా గుర్తించవచ్చు. వీరు ఎంత శాతం వినికిడి కోల్పోయిందీ గ్రహించి దానికి తగిన హియరింగ్ ఎయిడ్ వాడటం వలన వారు తిరిగి వినగలుగుతారు. శ్రవణ యంత్రాలు ఈ మధ్యకాలంలో పలు రకాలు అమ్మకంలో ఉన్నాయి. వాటిలో రకాలు : (1) జేబులో పెట్టుకునే యంత్రం (2) చెవిలో పెట్టుకునే యంత్రం. చెవిలో పెట్టుకునే చిన్న చిన్న యంత్రాలు వివిధ కంపెనీలని లభిస్తున్నాయి. వాటిలో ఏది సరైనదో స్పెషలిస్టును సంప్రదించి ఉపయోగిస్తే వినికిడి శక్తిని తిరిగిపొందవచ్చు. అలాగే కాక్లియో పూర్తిగా దెబ్బతిన్న వారిలో కాక్లియార్ ఇన్‌ప్లాంట్స్ లోపలి చెవిలో ఆపరేషన్ చేసి అమర్చడం వలన వారు వినికిడి శక్తిని తిరిగి పొందగలుగుతారు. ◆

హాని కల్గించే కల్తీలు



* డాక్టర్ వి.ఉమేష్ బాబు

సాధారణంగా తినే ఆహార పదార్థాలలో కల్తీ వ్యర్థ పదార్థాలు కలిసి ఉండుట వలన ఆరోగ్యం చెడిపోతుంది. దీనివలన వ్యాపారులకు లాభాలు, ఉపయోగించే వారికి ఆరోగ్య లోపాలు రావటం జరుగుతుంది. ఈ కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసేటప్పుడు కాని, విక్రయించేటప్పుడు కాని జరుగుతుంది. కొన్నిసార్లు ఇతర రసాయనాలు కలపటం వలన ఉపయోగాలు కూడా ఉంటాయి. (ఎసెన్స్‌లు) ఇంకొన్నిసార్లు ఒక ప్రత్యేక వ్యాధి నివారణకు కూడా రసాయనాలు కలపటం జరుగుతుంది. (థైరాయిడ్ జబ్బు అరికట్టే దశలో ఉప్పులో అయోడిన్ కలపడం జరుగుతుంది) దీనిని [illegible]

గోధుమలు, బియ్యంలో మట్టిబెడ్డలు, వడ్లు కలపబడి ఉండటం వల్ల కడుపులో రాళ్ళు, గ్యాస్ట్రిక్ వస్తుంది. పప్పుధాన్యాల్లో కోల్టార్ డై, కేసరిదాల్ కలపబడి ఉంటాయి. వీటివలన న్యూరోలైత్తెరిజమ్ అనే వ్యాధి సంక్రమిస్తుంది. పసుపులో లెడ్‌క్రోమేట్ పౌడర్ కల్తీ కావడం వలన ప్రేగుల కాన్సర్ వస్తుంది. ధనియాల పొడిలో స్టార్చ్, అవుపేడ, గుర్రం పేడ కలుపుతారు. దీనివలన లివర్ జబ్బులు వస్తాయి. మిరియాల్లో బొప్పాయి గింజలు, కారంలో రంపపు పొట్టు, ఇటికరాయి పొడి వలన ప్రేగులలో జబ్బులు, కాన్సర్ వస్తుంది. టీ పొడిలో మినపపొట్టు, చింతగింజల పొడి, వాడిన టీపొడి, రంపపు పొట్టు కలపటం వలన పెన్‌క్రియాస్ జబ్బులు వస్తాయి. కాఫీపొడిలో ఖర్జూరగింజల పొడి, చింతపిక్కల పొడి కలుపుతారు. దీనివలన చిన్నప్రేగులలో కంతులు వస్తాయి. కొబ్బరి నూనెలో వైట్ ఆయిల్, శనగ నూనెలో తవుడు ఆయిల్, ఆముదంలో పసుపుకొమ్ముల చూర్ణం కలవటం వలన చర్మవ్యాధులు, అజీర్తి, ఆకలి జబ్బులు, విరోచనాలు సంక్రమిస్తాయి. జీలకర్రలో సోపు, వెన్నలో స్టార్చ్, బియ్యపు పిండి కలిస్తే కోలి క్యాన్సర్, లివర్ జబ్బులు వస్తాయి. పసుపులో బియ్యం పిండి, తెల్లరంగు పొడి కలిస్తే అజీర్తి, త్రేన్పులు వస్తాయి. శనగపిండిలో పచ్చిబఠాణి పిండి, బొంబాయిరవ్వలో బియ్యపురవ్వ కలవటం వలన గ్యాసు, విరోచనాలు, కడుపుమంట, అజీర్తి సంభవిస్తాయి. నెయ్యిలో డాల్డా, ఐస్‌క్రీముల్లో సెల్యులోజ్, వేయకూడని రంగులు, స్వీట్స్‌లో తక్కువ క్వాలిటీ రంగులు కలిపితే జాండిస్, లివర్ జబ్బులు, కడుపులో నొప్పి వచ్చే అవకాశం ఉంది. గ్రీన్‌పీస్ (పచ్చబఠాణీలు)లో ఆకుపచ్చరంగు, పాలల్లో నీళ్లు, స్టార్చ్, కొవ్వు తీయుట వలన వాంతులు, కండరాల జబ్బులు వస్తాయి. మైదాపిండిలో బియ్యపు పిండి, బియ్యంలో పాలిష్ రంగులు కలపడం వలన ఆకలి లేకపోవుట, కడుపు నొప్పి వస్తుంది. పంచదారలో బియ్యపు రవ్వ, కుంకంలో ఎర్రరంగు, శనగపిండి కల్తీ అయితే నీరసం, డిప్రెషన్ సంభవిస్తాయి.

రంగులు : 1) కలరు కోసం వాడేవి - పసుపు, ఎర్రరంగు, 2) వాసన కోసం వాడేవి - ఎసెన్స్‌లు, 3) తీపి కోసం వాడేవి - చాక్రిన్, 4) నిల్వ ఉంచుటకు వాడేవి - సార్బిక్ యాసిడ్, సోడియం బెంజోయేట్, 5) పులుపు కోసం వాడేవి - సిట్రిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్ ఇక్కడ ఉదహరించిన రంగులు మొదలగునవి ప్రేగులు, కిడ్నీ క్యాన్సర్‌కు దారి తీయవచ్చును. ఈ రకమైన కల్తీ చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం ప్రివెంటెన్స్ ఆఫ్ ఫుడ్ అడల్టరేషన్ యాక్ట్ ప్రకారం 6 నెలలు, 5 సంవత్సరాల జైలు శిక్ష, 1000 రూపాయల నుండి 5,000ల వరకు ఫైను విధించవచ్చు. దీనిని అరికట్టడానికి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఆఫీసర్లు ఉంటారు. దీనికి సంబంధించిన లేబరేటరీలు అన్ని రాష్ట్ర ముఖ్య పట్టణాలలో ఉన్నాయి. వారు దీనిని గుర్తించి శ్రద్ధ తీసుకుని ఆహార పదార్థాల కల్తీ నిరోధిస్తారు. ఆహార పదార్థాల కల్తీని నిరోధించే ఈ కింద ఉదహరించిన సంస్థలు ఉన్నాయి. 1) ప్రపంచ వ్యాప్తంగా ఉన్నది ఎఫ్ఏఓ/డబ్ల్యుహెచ్ఓ - కొడెక్స్ ఎలిమెంటరియస్ - వరల్డ్ హెల్త్ సంస్థలో ఉంటుంది. 2) ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్టరేషన్ పి.ఎఫ్.ఎ. (ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్టరేషన్) 3) అగ్‌మార్క్ స్టాండర్డ్స్ 4) బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్

(హెల్త్ హెల్ప్ సౌజన్యంతో)

✻ అంపశయ్య నవీన్



ఆరంభమే కాని అంతం లేని టీవీ సీరియల్స్

అర్జున్‌రావు, అతని భార్య శ్రావణి వాళ్ళింట్లో రేపు వాళ్ళ పాప బర్త్‌డే ఉందని చెప్పడానికి మా ఇంటికొచ్చారు.

అర్జున్‌రావు ఈ ఊర్లో నాకున్న మంచి స్నేహితుల్లో ఒకడు. మంచి పుస్తకాలు చదువుతాడు. వాటిని గురించి నాతో చర్చిస్తుంటాడు. తను ఈ మధ్యనే చదివిన ఓ పుస్తకాన్ని గూర్చి నాతో చర్చించడం మొదలు పెట్టాడు. అతని భార్య శ్రావణేమో లోపల మా ఆవిడతో ఏవో కబుర్లు చెబుతూ కూర్చుంది. ఓ పది నిమిషాలు కాగానే శ్రావణికి అకస్మాత్తుగా ఏదో గుర్తొచ్చింది.

"మేం వెళ్తామండి..." అందామె లేచినిల్చొని.

"ఇప్పుడే వచ్చారు గదా... కాసేపు కూర్చోండి... ఇప్పుడు మీకంత అర్జెంట్ పనేముంది?" అన్నాను నేను.

అర్జున్‌రావు రిస్టువాచ్ చూసుకుంటూ "ఇప్పుడామెకు చాలా అర్జెంట్ పనే ఉంది సార్. ఇంకో పదినిమిషాల్లో ఆమె మా ఇంట్లో ఉండి తీరాలి. లేకపోతే కొంపలంటుకుపోతాయి" అన్నాడు.

"ఏమిటంత అర్జెంట్ పని మాతో చెప్పకూడదా?"

"చెప్పొచ్చు... చెప్పెయ్యనా శ్రావణీ?" అన్నాడు అర్జునరావు

"మీరు కాస్త నోరు మూస్తారా?" అంది శ్రావణి కోపంగా భర్తకేసి చూస్తూ. మరుక్షణంలో వాళ్ళు మా ఇంట్లోంచి బయటికెళ్ళిపోయారు.

"ఏమిటి వాళ్ళసమస్య? నీకేమన్నా అర్థమైందా?" అన్నాను మా ఆవిడ వంక చూస్తూ.

"ఇంత చిన్న విషయం మీకర్థం కాలేదా?"

"అర్థం కాలేదు"

"ఇంకాసేపట్లో టీవీలోని రెండు మూడు ఛానళ్ళలో రెండు మూడు సీరియల్స్ వస్తాయండి. శ్రావణికి ఆ సీరియల్సంటే పిచ్చి ఇష్టమట.. ఎన్ని పనులున్నా వాటిని వదిలిపెట్టదట...ఇప్పుడు 7.55 అయ్యింది కదా... ఇంకో పది నిముషాల్లో ఓ సీరియల్ స్టార్టవుతుంది. నిన్నటివరకు చూసిన ఆ సీరియల్‌లోని హీరోయిన్ చాలా కష్టాల్లో ఉంది. ఆమెను చంపెయ్యాలని స్వయంగా ఆమె మామగారే కొందరు రౌడీల ద్వారా ప్రయత్నిస్తున్నాడు. నిన్న ఆ రౌడీలు ఆమె లేనప్పుడు ఆమె ఇంట్లో జొరబడి ఆమె వండుకున్న అన్నంలో విషం కలిపివెళ్ళారు. నిన్న సీరియల్‌ని అక్కడ ఆపేశారు. ఇవ్వాళ ఆ హీరోయిన్ ఆ విషం కలిపిన అన్నం తినేసి చచ్చిపోతుందేమోనని చాలా మంది హడలి ఛస్తున్నారనుకోండి.... శ్రావణికి ఈ సీరియలంటే చాలా ఇష్టమట. ఇవ్వాళ్ళ ఆ హీరోయిన్ గతి ఏమవుతుందోనని చాలా ఆందోళన పడుతూ వెళ్ళింది" అంది మా ఆవిడ.

"ఓహో! ఆ సీరియలా? నువ్వు కూడా ఆ సీరియల్, దాని తర్వాత వచ్చే మరో రెండు సీరియల్స్ రోజూ చూస్తుంటావు కదా.. నువ్వు చూస్తున్నావని నేనూ అప్పుడప్పుడు వచ్చి టీవీ ముందు కూర్చుంటున్నాను. ఆ హీరోయిన్ విషం కలిపిన అన్నం తిని చనిపోతుందేమోనని మీరేమీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆమెను చంపెయ్యాలని ఆమె మామగారు, ఆమె ఇద్దరు సవతులు ఇట్లా ఎన్నోసార్లు ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఆశ్చర్యమేమిటంటే ఈ సీరియల్‌లోని హీరోకు ఒక్కరు కాదు ఇద్దరు కాదు ముగ్గురు భార్యలు. మొదటి భార్యమీద ఓ అపనింద వేసి ఆమెను ఇంట్లోంచి పంపించేస్తారు. తర్వాత అతగాడు ఆమె చెల్లినే పెళ్ళి చేసుకుంటాడు. ఆ తర్వాత పెళ్ళయి, ఓ అమ్మాయిని కూడా కన్న ఓ స్త్రీ వాళ్ళ ఆస్తి కాజేద్దామని వాళ్ళింట్లో చేరుతుంది. ఓ కపట నాటకం ఆడి అడ్డగోలుగా ఆ ఇంట్లో ప్రవేశించిన ఈ మాయావిని కూడా హీరోగారు పెళ్ళి చేసుకుంటారు. ఈ మామగారూ, ఈ ఇద్దరు సవతులూ కలిసి ఎంతో అన్యాయానికి గురైన హీరోగారి మొదటి భార్యను చంపెయ్యాలని ఎన్ని మాయోపాయాలను పన్నుతారో లెక్కలేదు. పూర్వం హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని చంపడానికి ఎన్నిరకాల పద్ధతుల్ని ఉపయోగించాడో వీళ్ళూ అన్ని పద్ధతుల్ని ఉపయోగిస్తారు. అయినా ఆ మొదటి భార్య చావదు. ఈలోగా ఆ భర్త... అంటే హీరోగారికి మతిస్థిమితం పోతుంది. అతన్ని బాగు చెయ్యాలని అతని మొదటి భార్యా, అతన్ని అదే స్థితిలో ఉంచాలని అతని మిగతా ఇద్దరు భార్యలూ, తండ్రి ప్రయత్నిస్తుంటారు.

ఈ కథ ఇలా సాగిపోతూనే ఉంటుంది. ఇప్పటికి నాలుగు వందల ఎపిసోడ్స్‌ని పూర్తి చేసుకున్న ఈ సీరియల్ ఇంకో నాలుగు వందల ఎపిసోడ్స్ దాకా సాగుతూనే ఉంటుంది. ఈ సీరియలే కాదు.. ఇప్పుడు అనేక ఛానెళ్ళలో వస్తున్నయే ఇతర సీరియల్‌ని తీసుకున్నా ఇదే పరిస్థితి. కుట్రలు, కుతంత్రాలు, ఎత్తుకు పై ఎత్తులు, ప్రతీకారాలు తీర్చుకోవడానికి ఎంతటి అమానుషత్వానికైనా తెగించడం... ఏ సీరియల్‌ని చూసినా ఇదే వాతావరణం... స్వచ్ఛమైన మానవత్వపు విలువల్ని చూపించే ప్రయత్నమే లేదు.

ఓ సీరియల్‌లో ఇద్దరు ప్రేమికుల్ని విడదీయడానికి ఓ కాళ్ళులేని స్త్రీ ఎంత వికృతంగా, ఎంత అమానుషంగా ప్రవర్తిస్తుందో చూస్తోంటే స్త్రీలంటేనే అసహ్యం కలుగుతున్నది. మరో సీరియల్‌లో ఓ చెల్లెలు స్వయంగా తన తోడబుట్టిన అన్న కుటుంబాన్ని మొత్తం సర్వనాశనం చేయాలని ప్రయత్నిస్తుంటుంది. మరో సీరియల్‌లో చిన్నవయసులోనే తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఓ పసివాడి ఆస్తిని కాజెయ్యడానికి అతడి బంధువులు ఎంత వికృతంగా పోట్లాడుకుంటారో చూపిస్తున్నారు.

ప్రతి సీరియల్‌లోనూ నెగెటివ్ క్యారెక్టర్స్ ప్రధాన పాత్రలు. శాడిజమే – అంటే క్రౌర్యమే ముఖ్యమైన కథాంశం. ఇలాంటి శాడిస్టిక్ సీరియల్స్‌ని ప్రతి ఇంట్లో పెద్దలతో బాటు చిన్న పిల్లలు కూడా చూస్తున్నారు. మైనం ముద్దల్లాంటి ఆ పసిపిల్లలు ఈ కుటిల, కుత్సిత, కుళ్ళు సీరియల్స్ చూసి ఎంతగా ప్రభావితులవుతున్నారో ఆలోచిస్తే చాలా బాధ కలుగుతున్నది. మరొక దిగ్భ్రాంతి కలిగించే అంశమేమి టంటే ఈ టీవీ సీరియల్స్‌లో అత్యంత ధనవంతులైన కుటుంబాలే కనిపిస్తున్నాయిగానీ పేదవాళ్ళు గానీ, కింది మధ్యతరగతి వాళ్ళుగానీ కనిపించడమే లేదు. టీవీ సీరియల్స్ అన్నింట్లోనూ కోట్ల రూపాయల విలువ చేసే బిల్డింగులు, కార్లూ, గాడ్జెట్లు తప్ప పూరిగుడిసెలు గానీ, మామూలు ఇండ్లు గానీ కనిపించనే కనిపించవు. ఒక్కసారి ప్రారంభమైన సీరియల్‌కు అంతమంటూ ఉండదు. పేకాటలాగా, మద్యపానంలాగా, డ్రగ్స్‌లాగా టీవీ సీరియల్స్ కూడా మన మధ్యతరగతి స్త్రీ పురుషులకు తీవ్రమైన వ్యసనాలుగా మారిపోతున్నాయి. ఈ దుర్మార్గమైన సీరియల్స్ నుండి సామాన్యులను రక్షించే వారేలేరా? ◆

జముకుపాట

ఎగిరే పిట్టల్లా వాడి పాటలు
ఊరిమీదుగా గిరికీలు కొడుతుంటాయి
నాగావళి నడకలాంటి పాటతో
జముకును శృతి చేసి
గడపగడపకీ వాడు పంచే పాటల మాధుర్యం
జీడిపాకం సీరియళ్ళతో చెడిపోయిన
ఇంద్రియాలకు రుచించదుగాక రుచించదు!
గుండెబావిలోంచి రాగామృత జలాన్నితోడి
జనంలోకి ప్రవహింపజేయడం వాడికి మాత్రమే తెల్సు
వాడి పొట్టలో నాలుగు అక్షరం ముక్కలు లేకపోయినా
వాడినోటనే వినాలి
భారతమైనా రామాయణమైనా
గౌరీ పున్నమి వెన్నెల్లో...
ఆకలి కర్రకు చూపుల దీపాన్ని కట్టి
సీతమ్మ వారి వనవాస మెత్తుకుంటే
ఊరంతా దుఃఖపు వాసన! (తడి)
రుక్మిణీ కళ్యాణం పాడితే
కన్నెపిల్లల మనసులు కళ్యాణ వేదికలే..
సీతమ్మోరిని చెరబట్టినట్టు
ద్రౌపదీదేవికి కోకలిప్పినట్టు
వాడిపాటల్ని పరాభవిస్తున్న
రావణులు, దుశ్శాసనులు ఎందరో-
వాడిగుండె చెలమలోంచి తేటలా ఊరేపాటల్ని
ఆత్మలేని శరీరాలుగా
అలంకారాలతో...
స్టీరియోల్లోంచి రంకెలేస్తుంటే...
నాయుడోళ్ళ ఎడ్ల కాళ్ళ కింద పడి నలిగిన
లేగలా...
వాడిగుండె జముకు ఎన్ని ముక్కలయ్యిందో!

* చింతా అప్పలనాయుడు

నల్లడేగ

ఆకాశంలో
ఎగురుకుంటూ
వచ్చింది నల్లనిడేగ
దాని తాకిడికి పగిలాయి, చిట్లాయి
ఎన్నోవందలాది దేహాలు
ఆఖరికి నా శరీరం కూడా
మా దేహాల్ని తన్నుతూ
తొక్కుతూ
ప్రవేశించాయి
సామ్రాజ్యవాద పిశాచాలు
మా రక్తంతో నడుస్తాయట
వారి ఎస్టీములు
జాగ్రత్త! జర జాగ్రత్త!!
మా లాగే
మీ శరీరాలు
సామ్రాజ్యవాద గుళ్ళకు
తునాతునకలైపోతాయి
జర జాగ్రత్త
(ఇరాకీల అనుభవం నుంచి)

* జిలుకర నరేష్

"అరే పిల్లలూ రేపటితో మీకు పరీక్షలై పోతున్నాయి కదరా. తర్వాత ఏం చేద్దాం చెప్పండి?" అంటూ తరగతిలోనే పిల్లలనడిగారు మాస్టారు. "స్కూలుకు వచ్చి ఆడుకుంటామండీ" అన్నారు కొందరు పిల్లలు. "పరీక్షలైపోయినా పుస్తకాలు కూడా తీసుకురావాలా సార్" అంటూ కొందరు ప్రశ్నించారు. "పుస్తకాలు తీసుకురానవసరం లేదు. వచ్చి హాయిగా మీకిష్టమైన ఆటలు ఆడుకోండి" అని మాస్టారు అనడంతోనే పిల్లలంతా చప్పట్లు కొడుతూ "మనం ఆడుకోవచ్చంటా" అనుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు.

సెలవుల్ని సద్వినియోగం చేసుకోవాలి

* వి.ఆర్.వాగోలు

"సరే సెలవులలో మీరంతా ఏమి చేస్తారు రా?" అని అడగటంతో "నేను ఊరికి వెళతానండీ" "నేను ఇంటి వద్దనే ఉంటానండీ" "నేను మా తాతయ్య వాళ్ళ దగ్గరకు వెళతానండి" అంటూ పిల్లలు ఉత్సాహంగా చెప్పారు. కొందరేమో బాగా ఆటలాడుకుంటామండి అని చెప్పారు. "మరి సెలవులలో మీకు నేను కొన్ని పనులు చెబుతాను చేస్తారట్రా" అనగానే "చేస్తామండీ" అంటూ ముక్తకంఠంతో అన్నారు.

ఇది వేసవి కాలం కనుక ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆటలు ఆడుకోవాలి. ఎండలో ఆటలాడితే వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. కనుక సాధ్యమైనంత వరకు ఎండ తగలకుండా చూసుకోవాలి" అన్నారు. "అలాగేనండీ" అంటూ పిల్లలు జవాబిచ్చారు. ఖాళీ సమయంలో పాఠ్యాంశాలు మీకు అర్థం కాని, కష్టమైన వాటిని నేర్చుకోవడానికి ప్రయత్నించాలి. వాటికోసం బాగా సాధన చేయాలి. అలా చేస్తే అర్థం కాని విషయాలు అర్థమవుతాయి. తేలికగా ఉంటుంది. తీరికవేళల్లో ఎండలో తిరగకుండా మీకిష్టమైన బొమ్మలు వేయండి. వాటికి చక్కని రంగులు దిద్దండి. వాటినన్నింటినీ ఒక పాత పుస్తకంలో అంటించండి. ఎంచక్కా ఒక డ్రాయింగ్ పుస్తకం తయారవుతుంది" అన్నారు మాస్టారు.

బాలబాలికలకు సెలవులంటే ఎనలేని ఆనందం. సెలవులలో పుస్తకాలతో పని లేదు. పలకా బలపం పట్టనవసరం లేదు. పాఠాలు అప్పచెప్పనవసరం లేదు. హోంవర్క్ అంతకన్నా చేయాల్సిన పని లేదు. హాయిగా సమయమంతా మిత్రులతో కలిసి ఆడుకోవచ్చనుకుంటారు.

ఇటువంటి సెలవులను చిన్నారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవటానికి పెద్దలు, తల్లిదండ్రులు కొంత కష్టపడక తప్పదు. చిన్నారుల్లో గ్రాహ్యక శక్తి బాగా ఉంటుంది. ఎవరైనా తమకు ఇష్టమైన, తేలికగా ఉన్న బాగా వచ్చిన పనినే చేయడానికి ఇష్టపడతారు. బాలల విషయంలోనూ అంతే.

సెలవులలో ఆటపాటలతోనే బాలల్లో విజ్ఞానాన్ని పెంపొందించవచ్చు. అప్పటివరకు పాఠశాలకు వెళ్ళిన బాలబాలికలు సెలవులలో బాగా ఆటలాడుకోవాలని, సరదాగా గడపాలని అభిలషిస్తారు. బాలబాలికల ఆటలను శ్రద్ధగా గమనిస్తూ వారిలో అంకెలు, సంఖ్యలు, కూడిక, తీసివేత వంటి చిన్నచిన్న గణిత శాస్త్ర భావనలను పెంపొందించవచ్చు. వీటికి గోళీలు, చింతగింజలు, ఇసుపుల్లలు వంటివి సరిపోతాయి.

ఇంట్లో మనం నిత్యం ఉపయోగించే వస్తువులను ఇంగ్లీషులో పలుకుతూ వారిచేత పలకరింప చేయాలి. తద్వారా సహజంగానే ఆంగ్లం పట్ల భయం కొంత తొలగి కొన్ని ఇంగ్లీషు పదాలు నేర్చుకొనే అవకాశం ఉంటుంది. ఖాళీ సమయాలలో చిన్నారులు ఉన్నప్పుడు పెద్దలు దినపత్రిక చదువుతూ ఉంటే చిన్నారులు కూడా పత్రికా పఠనానికి అలవాటు పడతారు. తొలుత వారు సినిమా పేజీ,- క్రీడా పేజీల వైపు ఆకర్షితులవుతారు. దానికి కారణం ఆయా పేజీల్లో బొమ్మలు అధికంగా ఉండటమే. అలా పత్రిక చూడటం అలవాటు చేసుకొన్న బాలబాలికలు క్రమంగా తమదైన శైలిలో పత్రికలోని పదాలను చదవటానికి ప్రయత్నిస్తారు. ఈ సమయంలో వారు తప్పుగా ఉచ్చరించే పదాలను గుర్తించి, సరిచేసి దానిని సరిగా ఉచ్చరించేలా జాగ్రత్త తీసుకోవాలి.

ఆదివారం దినపత్రికలలో ఎక్కువ పత్రికలు బాలల కోసం కొంత భాగాన్ని కేటాయిస్తున్నాయి. దానిలో ఎక్కువగా చిత్రలేఖనం, ఏదో ఒక బొమ్మ ఇచ్చి దానికి రంగులు దిద్దమనటం, ఏవో చుక్కలు ఇచ్చి వాటిని వరుసగా కలుపమనడం వంటివి, ఒక బొమ్మ ఇచ్చి అది వెళ్ళాల్సిన గమ్యానికి దారి కనుక్కోమనడం వంటి శీర్షికలతో బాలబాలికలలో సృజనాత్మక కౌశలాలు పెంపొందించే ప్రయత్నం జరుగుతూ ఉంటుంది. సాధ్యమైనంత వరకు పిల్లలు ఆ శీర్షికల వైపు ఆకర్షితులయ్యేలా ప్రోత్సాహం అందించాలి.

బాలల ఆటపాటలలో పాల్గొంటూ వారిని నిరుత్సాహపరచకుండా ప్రోత్సహిస్తూ వారిలో మేధాశక్తిని పెంపొందించవచ్చు. దీనికి ఏ మాత్రం ఖర్చు కాదు. పైగా ఇటువంటి విషయాలలో విద్యార్థినీ విద్యార్థులు చురుగ్గా పాల్గొంటూ ఇతరుల కంటే తాము ముందుండాలని కోరుకోవడం గమనించవచ్చు. బాలబాలికల పట్ల ఇదంతా సహజంగా జరగాలి. అంతేకాని కావాలని చేస్తున్నట్లుండకూడదు. అలా జరిగితే చిన్నారులు అనాసక్తిని చూపించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వారికిచ్చే పుస్తకాలు ఎక్కువగా రంగురంగుల బొమ్మలు, అందునా పక్షులు, జంతువులతో కూడినవైతే మరీ మంచిది. అటువంటి వాటి పట్ల పిల్లలు సులభంగా ఆకర్షితులవుతారు.

సెలవులలో ఇటువంటి చిన్న చిన్న కృత్యాల ద్వారా బాలబాలికల జీవితంతో సెలవులు సద్వినియోగం కావడమే గాక వారికి అర్థం కాని, తెలియని విషయాలు సులభంగా తెలియజెప్పటకు, సృజనాత్మక విలువలు పెంపొందించేందుకు వీలుంటుంది. ◆

రక్షణ

అడవిలో ఓ కంచర గాడిద వుంది. దానికో అందమైన చారల పిల్ల. ఓసారి పక్కనే ఉంటున్న పిల్ల ఏనుగు వచ్చి 'ఆంటీ మీ వాడిని నాతో పంపిస్తారా? ఇద్దరం అలా వెళ్లి ఆడుకుని వస్తాం!' అంది.

'జాగ్రత్త. ఎక్కువ దూరం వెళ్లకండి. ప్రమాదం' అని జాగ్రత్తలు చెప్పి పంపింది తల్లి.

ఇంటి నుంచి బయలుదేరిన గాడిద పిల్ల ఏనుగు పిల్లతో 'మన మీదకు ఎవరన్నా శత్రువులు వస్తే ఏం చేయాలి?' అనడిగింది.

'నేనైతే తొండంతో చుట్టి నేలకేసి కొడతాను. నీకు కొమ్ములు లేవుగదా. నీ తలనే తొండంలా ఉపయోగించి, క్రూర మృగాల్ని తరిమికొట్టాలి' అంది. అలా మాట్లాడుకుంటూ చెట్ల మధ్యకు వెళ్లాయి. ఏనుగు పిల్ల చెట్ల ఆకులు అందుకుని తింటూవుంది. పిల్లగాడిద పచ్చిక మేస్తూ వుంది. అలా అవి రెండూ తింటూ, ఆడుకుంటూ దూరంగా వెళ్లాయి. వీటిని చూసిన తోడేలు ఒకటి చాటుగా వచ్చి, గాడిద మీద దాడి చేసింది. అది వెంటనే ఏనుగు చెప్పిన ప్రకారం తలతో తోడేల్ని ఎదుర్కొనేందుకు ప్రయత్నించింది. కాని అది గాడిదపిల్ల వీపుమీద, వెనకవైపు దాడిచేసి చంపాలని చూసింది. అది అరుస్తూ, తోడేల్ని తప్పించుకుంటూ ఏనుగు దగ్గరకు పరిగెత్తింది. తోడేల్ని చూసిన ఏనుగు ఘీంకరిస్తూ, తొండాన్ని పైకెత్తి మీదకు రావడంతో అది దూరంగా పారిపోయింది.

ఇంటికి చేరిన పిల్లగాడిద తల్లితో అడవిలో జరిగిన సంగతంతా చెప్పింది. అప్పుడు తల్లి ఇలా చెప్పింది. 'ఒక్కో జంతువు శరీర నిర్మాణ పద్ధతి ఒక్కో తీరుగా ఉంటుంది. ఏనుగులు తొండంతో; ఎద్దులు, దున్నలు, జింకలు కొమ్ములతో; కోతులు నోటితో, చేతులతో ఆత్మరక్షణ చేసుకుంటాయి. మన గాడిదలు ఎదురు దాడి చేయడానికైనా, ఆత్మరక్షణకైనా, కాళ్లే సురక్షితం. వెనుకకాళ్లను ఆయుధంగా ఉపయోగించి శత్రువును ఎదుర్కోవాలి. ముందు మనం సాధు జంతువులం కనుక అడవిలో క్రూర మృగాల వల్ల ప్రమాదం కనుక ఒంటరిగా అస్సలు ఉండకూడదు. మన గాడిదల సమూహాన్ని వదిలితే ప్రమాదం' అని రక్షణబోధ చేసింది.

మరునటిరోజు నదికి నీళ్లు తాగేందుకు ఒంటరిగా వెళ్లింది పిల్లగాడిద. దానికి స్వయం రక్షణ తెలియదని నిన్నటి దాడిలో తెలుసుకున్న తోడేలు. గాడిద ఇంటి దగ్గరున్న చెట్టు చాటున మాటు వేసి కూర్చుంది. గాడిదపిల్ల నదివైపు వెళుతుండగా చూసి దాని మీదకు వెళ్లింది. దాన్ని చూసి గాడిదపిల్ల భయంతో ఇంటివైపు పరుగందుకుంది. తోడేలు మాత్రం అడ్డం తిరిగి పైకి దూకి మెడ అందుకోబోయింది. కాని తెలివిగా పక్కకు తప్పకుని పరుగందుకుంది గాడిద పిల్ల. కిందపడి లేచిన తోడేలు పరిగెత్తుతున్న గాడిద తొడ అందుకోబోయింది. వస్తున్న తోడేలును చూచిన గాడిద ఒక్క నిమిషం నిలబడి, వెనుక కాళ్లు లేపి బలంగా తన్నింది. ఊహించని దెబ్బ తగిలేసరికి అంతెత్తున ఎగిరిపడి చచ్చింది. అది చూసిన పిల్లగాడిద తన విజయాన్ని తల్లితో చెప్పేందుకు ఆనందంగా ఇంటికి పరుగు తీసింది.

పుప్పాల కృష్ణమూర్తి



క్విజ్-59

1. భారతదేశపు తొలి మహిళా ప్రధాని?
   ఎ.ఇందిరాగాంధీ   బి. ప్రియాంకగాంధీ
2. ఎస్కిమోలు నివసించే ఇళ్లను ఏమంటారు?
   ఎ. కాయక్   బి. ఇగ్లూ
3. భారత రాజ్యాంగాధిపతి?
   ఎ. రాష్ట్రపతి   బి. ప్రధానమంత్రి
4. 'పేరడైజ్ లాస్ట్' రచయిత?
   ఎ.జాన్ మిల్టన్   బి. షేక్స్పియర్
5. పావురము దేనికి గుర్తు?
   ఎ. విప్లవం   బి. శాంతి
6. గడియారంలో పెద్దముల్లు, చిన్నముల్లు 12 మీద వుంటే సమయం ఎంత అయినట్లు?
   ఎ. 12   బి. 1
7. పశ్చిమబెంగాల్ రాజధాని?
   ఎ. హైదరాబాదు   బి. కోల్‌కతా
8. చంద్రగుప్త మౌర్యుని తల్లిపేరు?
   ఎ. మౌర్య   బి. ముర
9. ఏ విటమిన్ లోపము వలన రేచీకటి వస్తుంది?
   ఎ.'డి'
   బి.'ఎ'
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ. అమితాబ్ బచ్చన్
   బి. అభిషేక్ బచ్చన్

కలం స్నేహం



పేరు:డి.ఎస్.వెంకటేష్,
వయసు :15 సం॥
చదువు :10వ తరగతి
హాబీలు: పుస్తక పఠనం, బొమ్మలు గీయడం.
పూర్తి చిరునామా :ఎస్.వెంకటేష్, సన్నాఫ్ హనుమంతరావు, 3-2-101, వి.డి.పురం, ఆర్ఆర్‌నగర్, చెరువు సెంటర్, విజయవాడ.12.

పేరు: కె.కరుణాకర్,
వయసు : 16 సం॥
చదువు :10వ తరగతి
హాబీలు :డ్రాయింగ్ వేయడం, క్రికెట్ ఆడడం, చూడడం, టీవీ చూడడం, క్యారమ్స్ ఆడడం.
పూర్తి చిరునామా : కె.కరుణాకర్, 10వ తరగతి, సన్నాఫ్ కూతడి నర్సింహ, మేడిపల్లి, ఘట్‌కేసర్, రంగారెడ్డి.

చిన్నారి చిత్రకారులు



రాయన రమేష్,
7వ తరగతి,
ఎంపియుపి స్కూల్,
నాగవరం.

హరిత,
5వ తరగతి,
విజివికె.

పి.వి. రాఘవేంద్ర, 9వతరగతి,
శ్రీవాసవి ట్యుటోరియల్స్, కంబం,
ప్రకాశం.



దీపిక, 10వతరగతి,
హన్మకొండ.

క్విజ్ 58 జవాబులు

1.నాటకకర్తగా 2. రసాయనాలు 3. ఒంటె 4. నల్లరేగడి 5. XXV 6. వెన్నెముక 7. లక్నో 8. హైదరాబాదు 9. చార్లీ చాప్లిన్ 10. పుచ్చలపల్లి సుందరయ్య

★

క్విజ్ 57కి సరైన సమాధానాలు రాసిన వారు :

ఎల్.స్రవంతి, 5వ తరగతి, **వి.ఉమామహేశ్వరరావు,** 10 వ తరగతి, మద్దిపాడు, ప్రకాశం. **కాలువ తన్మయ,** అరండల్ పేట, గుంటూరు. **కుంజా విశ్వశాంతి,** భద్రాచలం, ఖమ్మం. **యు.పుల్లారావు, వి.యేసేబు, జి.వెంకటేశ్వర్లు,** 9వ తరగతి, యర్రగొండపాలెం, ప్రకాశం. **పి.వందన,** 7వ తరగతి, లక్ష్మీనగర్, మెదక్. **డి.వి.లలితారాణి,** 9వ తరగతి, బాపట్ల.

రుమాలులో న
తీయగలరా?
నేను ఒక
వెళ్లినప్పుడు మె
చూపించాడు.
వెు
రంగు రుమా
అతని కుడిచేతి
తర్వాత అదే
బంతిని తీసి
మాయమైన
చొక్కా జేబులో
ఇది ఎలాగో అర్థ
మొదట అంతే.
'ఈ ప్రదర్శన
రుమాళ్లు, రెంగ
ఒక రుమాలున
బంతిని ప్యాంట
ముప్పాతిక అం
మనం ఆ చేతి
పంపించాలి.
జేబులో అంతక
ఇవ్వాలి. ఈలో
ముందుగా అక్క
పరీక్షించడానికి

చుక్క

రుమాలు-బంతి

మేజిక్! మేజిక్!!



...యమ్! మీరు ...చి బంతిని ...దా! మొన్న ...మేజిక్ షోకి ...షియన్ తీసి ...టి ఎరుపు ... తీసుకుని ...కి దూర్చాడు. ...చేతిలోంచి ...చూపించాడు. ...రుమాలును ...చి తీసి చూపించాడు. ...కాలేదుకదూ. నాక్కూడా ...యనను అడిగితే ఇలా చెప్పారు. ...యడానికి రెండు ఎరుపు చేతి ...టేబుల్‌టెన్నిస్ బంతులు కావాలి. ...చొక్కా జేబులో వుంచాలి. ఒక ...జేబులో వుంచాలి. ఒక బంతికి ...ళం రంధ్రం చేసి ఎడమచేతి పిడికిలిలో వుంచుకోవాలి. ...కి అంటే ... ఆ చేతిలో వున్న బంతిరంధ్రములోకి రుమాలుని ...ాత ఆ బంతిని తీసి ప్రేక్షకులకు చూపించాలి. చొక్కా ...ుందే ఉంచిన రుమాలునుతీసి ప్రేక్షకులు పరిశీలించడానికి ...మీరు మీ చేతిలోని బంతిని. ప్యాంటు జేబులో వదిలి, ...దాచిన బంతిని చేతిలోకి తీసుకుని దానిని కూడా ప్రేక్షకులు ...ఇవ్వాలి'. మరి మీరుకూడా ఇలా చేసి చూస్తారా!

ఈ పతాకం ఎవరిది?

ప్రతి దేశానికీ తనకంటూ ఒక ప్రత్యేక పతాకం **ఉంటుంది. మన దేశానికి మూడు రంగుల జండా ఉన్నట్లే ప్రతి దేశానికీ రంగురంగుల జండాలుంటాయి. మరి మీరు ఇతర దేశాల జండాలను గుర్తించగలరేమో చూడండి.**

నీలం అడ్డ చారల మధ్య తెలుపు అడ్డచార. అందులో ప్రత్యేక గుర్తు. ఇది ఏదేశపు పతాకం?

అన్నయ్య



అనగనగా ఒక ఊళ్లో మధు అనే యువకుడు ఉండేవాడు. అతనికి నలుగురు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్లు ఉండేవారు. వీళ్లు పిల్లలుగా వున్నప్పుడే తండ్రి చనిపోయాడు. దాంతో తనకంటే చిన్నవారి బాధ్యత అంతా మధు మీద పడింది. పాపం చాలా కష్టపడి డబ్బులు సంపాదించి వారిని పోషించేవాడు. అలా వారికి పెళ్లిళ్లు కూడా చేశాడు. తను మాత్రం అలాగే ఒంటరిగా ఉండిపోయాడు. కష్టపడి సంపాదించిన ఆస్తి మొత్తాన్ని వారందరికీ పంచేశాడు. తండ్రి వారసత్వంగా తనకు అందిన ఉంగరం, గొలుసు మాత్రమే అతని దగ్గర మిగిలాయి. వయసు పైబడడంతో పని చేయలేక రోజుకొక తమ్ముని దగ్గర తింటూ వుంటాడు. కాని ఇది తమ్ముళ్లకు, వారి భార్యలకు కష్టంగా వుంటుంది. ఎలాగైనా అతని పీడ వదిలించుకోవాలనుకుంటారు. 'ఇక మా ఇళ్లకు తిండికోసం రావద్దు. వస్తే పలకరించనుకూడా పలకరించము' అని మొఖానే చెప్పేస్తారు. పొట్ట మలమల మాడుతున్నా అతనికి బాధ కలగలేదు. కానీ తను పెంచి పోషించిన తమ్ముళ్లు తనను ఇంటికి రావద్దన్నందుకు విపరీతంగా కుమిలిపోతాడు. మంచం పడతాడు. తమ్ముళ్లు, చెల్లెళ్లను పిలిపించి తన దగ్గర వున్న ఉంగరం, గొలుసు కూడా వారికే ఇచ్చేసి సుఖంగా ఉండమంటాడు. తాము అన్ని మాటలు అన్నప్పటికీ, ఆ స్థితిలోకూడా బంగారు నగలు ఇవ్వడం చూచి బావురుమని ఏడుస్తారు. ఇక ఎక్కడా ఉండవలసిన అవసరం లేదని తమ ఇంటికి వచ్చేయమని బతిమిలాడతారు. మధు సంతోషంగా వెళ్లడానికి సిద్ధమౌతాడు.

అవినాష్‌కుమార్, 9వ తరగతి, నెల్లూరు.

కథ రాయాలనుకుంటున్నారా!

మరి ఆలస్యం ఎందుకు?

రాసి పంపిస్తే 'నా కథ' శీర్షికలో ప్రచురిస్తాం. పది వాక్యాలు చాలు. చిన్నప్పటినుంచే రాయడం అలవాటు చేసుకుంటే పెద్దయ్యాక మంచి కథలు రాయగలుగుతారు. మరి మీ కథలకోసం ఎదురుచూస్తూ.....

బాలనేస్తాలు

...లలో దాగిన నేస్తం!



పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

?	సందు
	ని
	దవి
	ది
	చ్చ
	సరు

గతవారం జవాబులు	కా	వలి
		టుక
		వడి
		నుక
		సు
		రు

పాదయాత్రలూ - ప్రపంచ బ్యాంకు



* రుక్మిణి

"ఈ పాదయాత్రల మతలబేంటో అర్థం కాదు..!" ఒక తె.దేశం ఎమ్మెల్యే మహా చిరాగ్గా చీదరించుకున్నాడు. మొహం మటమటలాడించి చిందులు తొక్కాడు.

"బాబూ... నడిచేది వాడు.. నడిపించే వాడెవడో.. ఎవడి కాళ్ళతో వాడు నడిస్తే మన కాళ్ళకేమయింది?" ఒక ముసలి మంత్రిగారు [illegible] ఒలకబోశాడు.

"అదికాదు. [illegible] అసలు మొన్న మనం [illegible] వున్నా మన [illegible] [illegible] ఇచ్చారు. [illegible] [illegible] రవాణా [illegible] ముమ్ముందుకు [illegible] అంతర్జాతీయ [illegible] - టూరిస్టులు [illegible] హైదరాబాద్ మీద ఇప్పటికే [illegible]... జన్మభూవులు... [illegible] వాహన సౌకర్యాలున్న మన [illegible] నడిస్తే విదేశీ మీడియా [illegible]. మనం అనాగరిక ఆదిమ దశకు [illegible]మని వేలెత్తి చూపరా? మన పరువు [illegible]?"

"చాలా మంది జనం డబ్బుల్లేక బస్సుల్లో [illegible] చేత పట్టుకుని వలసలు పోతున్నారు. [illegible] కాలినడకనే నగరాలకు చేరుకుంటున్నారు [illegible]" విలేకరి అడిగిన ప్రశ్నకు ఒకరిద్దరు మంత్రులకు మూర్ఛపోవాలనిపించినా తమాయించుకున్నారు.

"కరువు ప్రకృతి ప్రసాదం... దాన్ని కూడా ప్రతిపక్షం 'రాజకీయం' చేస్తే ఎట్లా?" ముసలి మంత్రి.

"మరి మంచినీటికి కూడా కరువాయె... అదీ ప్రకృతి ధర్మమేనా?" విలేకరి మరో తేలుకొండి లాంటి ప్రశ్నను సంధించాడు.

"హవ్వ.. మంచినీళ్ళు దొరకడం లేదనడం పచ్చి అబద్ధం... చిన్న పాకెట్లు, మినరల్ వాటర్ బాటిల్స్... ఐ.ఎస్.ఐ. మార్కు కాన్లలో నీళ్ళు ఎక్కడబడితే అక్కడ అమ్ముతున్నారు. కొనుక్కోడం చాతగాక జనాలు మా మీద విరుచుకుపడుతున్నారు" యువమంత్రి ఆవేశంగా అట్లా అనేసరికి జరగాల్సిన డామేజీ జరిగిపోయింది. మూర్ఛలు పోదామనుకుంటూ వాయిదా లేసిన మంత్రులిద్దరూ మూర్ఛలోకి జారుకున్నారు. యువమంత్రి రెచ్చిపోతుంటే ముసలి మంత్రి వారించాక మిన్నకుండిపోయాడు.

"అదరరేగానీ... పాదయాత్రలో జనాల్ని రెచ్చగొట్టడంలో మతలబేంటి ? కరంటు బకాయిలు కట్టవద్దనీ... వాళ్ళని ఎగదోస్తే.. వాళ్లు కట్టకపోతే కరంటు గతేంటి? జెన్కో-ట్రాన్కోలు నడిచేదెట్లా? పైగా బ్యాంకు లోన్లు కూడా కట్టొద్దని ప్రచారానికి తగులుకుంటే ప్రభుత్వ నడవాలా? వద్దా?" ముసలి మంత్రి సన్నగా సన్నాయి నొక్కులు నొక్కాడు.

"కరువు అని మీరే అంగీకరిస్తున్నారు. వాడికి తింటానికే తిండిలేక ఊరొదిలి పరారైపోతున్నాడు గదా... కొందరైతే ఆకలి దెబ్బకు 'హరీ' మంటున్నారు. వాళ్ళని ఆదుకోడానికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటున్నది. ఉచితంగా బియ్యం ఇస్తే ఏమయ్యింది? పన్ను చూపిస్తే ఏమయింది? అని కూడా అడుగుతున్నారు" విలేకరి హుషారుగా అడిగాడు.

"అరె... కరువొచ్చిందని బకాయిలన్నింటిని వాయిదా లేసి - కొన్నిటిని మాపు కూడా చేస్తిమి. మళ్ళా వాండ్లను రెచ్చగొట్టడవేందో అర్థం కాదు!" యువమంత్రి శివాలెత్తి ఆవేశంతో ఆగంఆగంగా చిందులు తొక్కాడు.

"అన్నీ మీరే చెప్తున్నారు. ఒకవైపు బకాయిల వాయిదా... మాఫీలంటున్నారు - ఎట్లాగూ వాండ్లు కట్టేది లేదుగదా... లేనపుడు 'కట్టకండ్రా' అంటే వచ్చిన తప్పేంటీ? అది రెచ్చగొట్టడం ఎట్లా? ఆర్డరు వేశామంటున్నారుగా?" ఆ దెబ్బకు మరోమంత్రి మూర్ఛ బెటరనే ఆలోచనలో పడిపోయాడు.

"అహహా... అక్కడక్కడ అధికార్లు అవగాహన లేక అట్లా వసూళ్ళకు తిరుగుతుండవచ్చు..

"ఈ అధికార్లు ప్రభుత్వాన్ని ఖాతరు చేయడం లేదు - అధికార్లను నిలదీయండి... జన్మభూమి స్ఫూర్తితో పనులు చేపట్టండ్రి!" యువమంత్రి ఆదేశంతో అదునూ - పదునూ మర్చిపోయి రెచ్చిపోయాడు. ముసలి మంత్రికి తలప్రాణం తోకకు వచ్చింది.

"మాఫీచేయమంటే చేశాం... కట్టగలిగిన వాళ్ళు కట్టాలిగదా - మరిక రేపు అన్ని వనరులనూ... సదుపాయాలనూ ప్రైవేటు పరం చేసినపుడు ప్రజలు ఎవరిమీద ఎగిరిపడతారు. గవర్నమెంటుకేం సంబంధం లేనపుడు వాండ్లు చచ్చినట్లు కట్టాలి గదా? ప్రైవేటువాడు బొడ్లో చెయ్యేసి వసూలు చేస్తాడు. ప్రజలలో గవర్నమెంటుకేం సంబంధం ఉండదు. ఏదో ఎన్నికలు వచ్చినపుడు వాళ్ళు ఈ అభివృద్ధిని చూసి మిమ్మల్నే గెలిపిస్తాడు - మేం సమావేశాలూ.. మినీ మహానాడులూ.. జన్మభూవులూ అవీ నిర్వహిస్తూ 'అభివృద్ధి' పథంలోకి పయనిస్తాం...

ఈసారి విలేకరికి మగత గమ్మినట్లయింది. మూర్ఛపోతే బావుండదు - ఇది పూర్తయేసరికి తాను మూర్ఛపోవడం ఖాయమనుకుని నోరంతా బావురు కప్పలా తెరిచి ఆ ముసలి మంత్రిగారి వివరణ వింటున్నాడు.

"మన అభివృద్ధికి డబ్బు కావాలి.. ప్రపంచ బ్యాంకు నుండి రకరకాల పథకాలకు వేలకోట్ల రూపాయలు అప్పులు తెస్తాం.... ఆ పథకాల్ని ప్రైవేటు వారికి అప్పజెప్పి చేతులు దులుపుకుంటాం.... 'మా' అభివృద్ధిని చూసి ఓర్వలేని వారు పాదయాత్రలు చేస్తారు.. ఉద్యమాలంటారు.. ఆందోళనలంటారు..

"మరి ప్రపంచ బ్యాంకు... అప్పు... వడ్డీ... మ...త....ల...బు..."

"నందోరాజ్య భవిష్యతి" భవిష్యత్తులో ప్రజలే చెంబూ... తపేలా... గుడిసెలో అమ్మి వాళ్ళే కట్టుకుంటారు - అంతవరకూ ఇంతే!"

విలేకరి గజగజలాడిపోతూ... కండిస్తూ మూర్ఛలోకి జారుకున్నాడు. ◆

ఇంటింటా నాటకం..

* లక్ష్మి

చరిత్ర తిరగేయండి. కథలూ, కవిత్వాలూ రాయడానికి ఆడామగా తేడాలుండవు. వారూ వీరూ కూడా పుంఖాను పుంఖాలుగానే అప్పుడు రాసేరు. ఇప్పుడూ రాస్తున్నారు. అంచేత కథలూ కవిత్వపరంగా ప్రసిద్ధ రచయితలూ వున్నారు. రచయిత్రులూ వున్నారు. అందమైన నవలలు వాళ్ళూ రాస్తున్నారు. వీళ్ళూ రాస్తున్నారు. కానీ డ్రామాల విషయం పరిశీలిస్తే ఆ విద్య కేవలం మగమారాజులకే పరిమితమై పోయింది! ఆ డ్రామా రచన ఫీల్డులో ఆడవారికి అడ్రస్సే లేకుండా పోయింది. కారణం ఏమిటని అడగండి. నాకు తెలిసిన రీజను చెబుతాను. నాటకంలో పాత్రలు ఉంటాయి. ఏమి మాటాడినా పాత్రలే మాటాడాలి గాని రచయిత జోక్యం చేసుకోకూడదు! ఆడవాళ్ళు కథ చెప్పి అవుననిపించుకుంటారే గాని ఇంత గొడవ పడలేరు. పాత్ర స్వభావం ఎంచుకుని ఆ స్వభావానికి తగ్గట్టు డైలాగులు రాయాలి. ఒకటీ రెండు పాత్రల వరకు ఫర్లేదు. రెండు వేర్వేరు స్వభావాలతో రెండు వేర్వేరు సంభాషణలు రచయిత్రులు కూడా పలికించగలరు. డ్రామా కేవలం రెండు పాత్రలతోనే నడవదు గదా! ఆరేడు పాత్రలుంటాయి. ఒక్కో సందర్భంలో పదీ పన్నెండు పాత్రలు కూడా ఉంటాయి!

ఒక పాత్ర మాటాడినట్టు ఇంకో పాత్ర మాటాడకూడదు. ఇది నాటకంలో ప్రాథమిక సూత్రం. నేను మాటాడినట్టు మీరుగానీ – మీరు మాటాడినట్టు నేను గానీ మాటాడలేం! నాటకం కూడా అంతే! అంచేత పాత్రలు ఎక్కువయ్యే కొద్దీ రచయితకి తలనొప్పి ఎక్కువవుతుంది. ఎన్ని పాత్రలున్నాయో అన్ని తరహాల డైలాగులు రాయాలి! ఇది ఆడవాళ్లకి సూటయ్యే విద్య కాదు. ఒక్క అబద్ధాన్ని పది రకాలుగా చెప్పడం మగవాళ్ళకే చేతనవును. చిన్నతనం నుంచీ ఈ విద్యను వంట పట్టించుకుని ఎదగడం వల్ల అప్పల్రాజు ఏమి మాటాడాలో తానే చెబుతాడు. అల్లాగే అప్పలకొండ రియాక్షను కూడా తానే ఊహించగలడు. నువ్వు అట్నుంచి వస్తే నేను ఇట్నుంచి వస్తాననే ధీమా మగమారాజుకే చెల్లు! నువ్వు ఒకటంటె నేను రెండంటాననే సిద్ధాంతంలో అతను పండిపోయి ఉంటాడు. అందుకే అందరి మాటలూ తానే పలుకుతూ – అది వాళ్ళ సొంత మాటలు సుమా అని నమ్మించగలడు. ఈ ఫీటు ఆడవాళ్లకి చేతకాదు!

ప్రాథమికంగా మగమారాజు కడు చమత్కారి. ఆ చమత్కారమే నాటక రచనకు పెట్టుబడిగా వుండి రాణిస్తోంది. అవుననుకున్న పాయింటుని కాదని చెప్పవలసి వచ్చినా – కాదని కొట్టి పారేసిన పాయింటుకి ప్రాణం పోసి బతికించాలనుకున్నా – అంతో ఇంతో చమత్కారం చాలా అవసరం! లౌక్యం గత్రాలు బాగా తెలిసుండాలి. సవాలక్ష అబద్ధాలు చెప్పి నమ్మించాలి. రాసిన పాత్రలకు సందర్భాన్ని బట్టి రంగూరుచీ వాసనలు మారుస్తూ వుండాలి. ఒక ముక్కలో చెప్పాలంటే – నాటకం రాసే రచయిత పదీ పదిహేను పాత్రల్లో బతకాలి. తద్వారా ఒక పాత్ర స్వభావం మరో పాత్రకి రుద్దకుండా జాగ్రత్త పడాలి. ఇన్ని గొడవల్ని కలుపుకుని నాటకం ద్వారా ఒక కథ చెప్పాలి. దానికో పట్టు వుండాలి. ఈ మొత్తం ఆర్టు కేవలం మగమనిషికే సొంతం. ఆ మాటకొస్తే నాటకం అతని రొటీను బతుక్కి నకలు!

అందువల్ల మగమారాజే రాయగలడు నాటకం! మాయామర్మాలు బాగా తెలిసిన మనిషి గనక – అస్తమానూ ఎత్తులూ పై ఎత్తుల్తో బతికే మనిషి గనక – ఇంద్రజాల మహేంద్రజాల విద్యల్లో పండిపోయిన వ్యక్తి గనక నాటకం మగాడి సొత్తయిపోయింది. నాటకం రాసినా, ఆడినా, ఆడించినా అతనికి అతనే సాటి! నాటక రచన అనగా పెనుమాయ అని అర్థం. మాయ మాటలు మాయ వాతావరణం అనాది నుంచీ మగాడికి అలంకారాలు. అందుకే – విష్ణుమాయ అనీ, కృష్ణమాయ అనీ నారద మాయ అనీ – అనేక మాయలు పురాణాల్లో సైతం మగదేవుళ్ళ పరంగానే నడిచేయి! అంతేగాని సరస్వతి మాయ, లక్ష్మీదేవి మాయ అంటూ ప్రత్యేకించి ఎక్కడా రాయలేదు! ఏతావాతా మాయలు నేర్చిన మనిషి మాత్రమే నాటకం రాయగలడని తాత్పర్యం. అందుకే రచయితలు తెగరాసేస్తున్నారు నాటకాలు! ఇన్నేసి నాటకాలు కేవలం మగవారే రాస్తున్నారంటే – సదరు మగమహా ప్రభువులు మాయగాళ్ళని సులువుగా అర్థమవుతోంది గదా!

అప్పుడప్పుడు భర్తమీద ఒళ్ళు మండి కోపగించుకున్న అర్ధాంగి భర్తని మందలించాలనుకుంటుంది. మందలించే పవర్సు ఆడవాళ్ళకు లేవు గాక లేవని మగమహర్షులు శాస్త్రాలు రాసి జాగ్రత్త పడ్డారు. అందువలన లలనామణి అలకపాన్పు ఏర్పాటు చేసుకుంటుంది. కనీసం ఇప్పుడైనా మగమారాజు తన తప్పును తెలుసుకోలేకపోతాడా అని ఆమె ఆశ! కానీ అది జరిగేపని కానే కాదు. ఆమె అలకపాన్పు ముచ్చట తీరకముందే – అతను గుండెపోటు వచ్చినట్టు నటిస్తాడు. డ్రామా తెలిసిన మనిషి గనక క్షణమో, అరక్షణమో అని తన మరణానికి ముహూర్తం పెడతాడు. ఆ మాట బాధగా ప్రకటిస్తాడు, దట్సాల్!

అతని ఉత్తుత్తి గుండెపోటు నటనకి అలివేణి పడిపోతుంది. పడిపోయినందుకు చిహ్నంగా అలక పాన్పు మీంచి అమాంతం దూకేస్తుంది. పతి దేవుడ్ని వాటేసుకుంటుంది. మిమ్మల్ని విడిచి బతకలేను నాథా – నాకోసమైనా తమరు బతకాలని ప్రాధేయ పడుతుంది. ఇకముందు అలగనుగాక అలగను అని ఒట్టేసుకుంటుంది. సర్వదేవతలారా నాపతి దేవుడ్ని కాపాడండని పద్యాలు పాడుతుంది. ఇంత రభస జరిగేక పతి దేవుడు కోలుకుంటాడు. దేవీ అని ప్రేమగా పిలుస్తాడు. ఇంకెక్కడి దేవి! ఆ వేళకి ఆమె అతనికి పాదదాసి లెవెల్లో పాదపూజలో నిమగ్నమై వుంటుంది. ఇదీ కథ. ఇంటింటి కథ. అంచేత భర్తని మందలించాలని వున్నా – ఆమెకు ఆ అవకాశం ఇవ్వడు పతిదేవుడు. నాటక రచనలో సిద్ధహస్తుడు గనక సీను మార్చి రాస్తాడు. వాతావరణం గమనించి ఏక్టింగు చేస్తాడు. అనువైన డైలాగులు ఆశువుగా గుప్పిస్తాడు. ఫిజికల్‌గా బోలెడు విన్యాసాలు ప్రదర్శిస్తాడు. మాటల్ని తూటాల్లాగా ప్రయోగించి ఆమె లేత మనసును కరిగించేస్తాడు. ఈ మాయలన్నీ మగవాడి సొత్తు. అంచేత అతనే రాయగలడు నాటకాలు! అందుకు ఆశ్చర్యమేల? ◆

* సింహాద్రి సరోజిని

ప్రకృతి సోయగాల మాథేరాన్

అదేదో ఊటీనో, డార్జిలింగో, కొడైకెనాలో మరో పర్వత ప్రాంత వేసవి విడిదో అనుకుంటే మీరు పొరబడినట్లే. నేటి కాలుష్య ప్రపంచానికి దూరంగా, అత్యంత స్వచ్ఛమైన ప్రకృతి అందాలతో పర్యాటకుల హృదయాలను చూరగొంటున్న ఆ ప్రాంతమే మాథేరాన్. ఇది మహారాష్ట్రలో ఉంది. మహారాష్ట్రలో అనేక హిల్ స్టేషన్లు ఉన్నప్పటికీ ఇది వాటన్నింటికీ భిన్నమైనది. మహాబళేశ్వర్, ఖండాలా, లోనావ్లా వంటి అనేక పర్వత ప్రాంత పర్యాటక కేంద్రాలు అక్కడ ఉన్నప్పటికీ మాథేరాన్ మాత్రం వాటన్నింటికీ చాలా భిన్నంగా ఉంటుంది.

మేము మార్చి 20న పూనా చేరుకున్నాము. మరునాటి రోజు ఉదయమే ఆరు గంటలకు పూనా నుంచి బయలు దేరే సింహఘడ్ ఎక్స్‌ప్రెస్‌లో కర్జత్‌కు చేరుకున్నాము. వెంటనే మాకు నేరల్‌కు వెళ్ళే లోకల్ రైలు దొరికింది. కర్జత్‌లోని వడాపావ్ చాలా రుచిగా ఉంటుందని తెలిసి అక్కడ అది తిన్నాము. నిజంగానే అది చాలా రుచికరంగా ఉంది. నాలుగు రూపాయతోనే చక్కటి అల్పాహారం చేశాము. రైల్వే స్టేషన్‌లో వీటిని అమ్ముతూ అనేక మంది జీవితం సాగిస్తున్నారు. ఈ మార్గంలో వేళ్ళే ప్రయాణీకులు కర్జత్ వడాపావ్‌ను తప్పకుండా రుచి చూస్తారు. నేరల్ నుంచి మాథేరాన్ సుమారు వంద కి.మీ. దూరంలో ఉంది. అక్కడకు వెళ్లాలంటే నేరల్ నుంచి టాక్సీలు దొరుకుతాయి. కానీ బొమ్మ రైలులో వెళ్ళిన అనుభూతే వేరని అక్కడి వారు చెప్పారు. అయితే మేము వెళ్ళేటప్పటికే 10 గంటలకు వెళ్ళే రైలుకు టిక్కెట్లు అయిపోయాయి. తరువాత 11గంటలకు మరో రైలు ఉండటంతో ముందుగానే టికెట్ బుక్ చేసుకొని అందులో బయలు దేరాము. నిజంగానే ఆ బొమ్మరైలులో ప్రయాణం అద్భుతమనిపించింది. అది చాలా నెమ్మదిగా వెళ్తూ ఉంటే మాథేరాన్ పర్వతాల అద్భుత అందాలను అన్ని కోణాల నుంచి చూసే అవకాశం లభించింది. నేరల్ నుంచి మాథేరాన్‌కు మధ్యలో రెండు స్టేషన్లు మాత్రమే ఉన్నాయి. అవి ఝూలా పట్టీ, వాటర్‌పైప్‌లైన్. ఝూలా పట్టీ దగ్గర పర్వత అందాలను చూసి తీరవలసిందే. ఒంటి గంటకు మాథేరాన్‌కు చేరుకున్నాము. ఈ మార్గంలో రైలు అనేక సొరంగాలను దాటుకుంటూ వెళ్ళింది. ఈ రైలు కనీసం 150 సార్లు మలుపులు తిరిగింది. కొన్ని మలుపుల దగ్గర మనం తల బైటికి పెడితే రైలు మొత్తాన్నీ చూడగలుగుతాము. ముందు రోజు రాత్రే హోటల్ రూం బుక్ చేసుకున్నందున ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండగలిగాము. హోటల్ స్టేషన్‌కు సమీపంలోనే ఉండటంతో వెంటనే అక్కడ భోజనం ముగించుకొని సైట్ సీయింగ్‌కు బయలుదేరాము. అక్కడ ఓపిక ఉండి కాలినడకన తిరిగితేనే నిజమైన ఆనందాన్ని పొందగలుగుతాము. మనం కూడా ప్రకృతిలో మమేకమై అక్కడి అందాలను ఆస్వాదించగలం. అయితే ఎక్కువ మంది పర్యాటకులు గుర్రాల మీద, లాగుడు రిక్షాల మీద తిరుగుతూ అక్కడి ప్రదేశాలను చూస్తారు. ముఖ్యమైన ప్రదేశాలన్నింటినీ ఆరు గంటలకల్లా చూసుకొని చివరగా సన్‌సెట్ పాయింట్ అంటే సూర్యాస్తమయ పాయింట్‌కు చేరుకొన్నాము. సూర్యాస్తమయాన్ని తిలకించేందుకు అక్కడ వందలాది మంది పర్యాటకులు వేచి ఉన్నారు. సూర్యాస్తమయం అవుతుండగా కాన్వాస్‌పై రవివర్మ గీచిన దృశ్యాన్ని చూస్తున్న అనుభూతి కలిగింది.

భారతదేశంలోనే ఎలాంటి కాలుష్యం లేకుండా స్వచ్ఛంగా ఉన్న ప్రదేశం ఇది. మాథేరాన్ అంటే అడవులతో నిండి ఉన్న ప్రదేశం అని అర్థం. ఇది 1817 ఎకరాలలో విస్తరించి ఉంది. 2001 జనాభా లెక్కల ప్రకారం ఇక్కడి జనాభా 5,139. ఇక్కడి ప్రజలు మరాఠీ, గుజరాతీ, హిందీ, ఆంగ్ల భాషలను మాట్లాడతారు. ఇక్కడి ప్రజలు పర్యాటకులతో చాలా సౌమ్యంగా, ఎంతో స్నేహపూర్వకంగా ఉంటారు. దీనిని 1850లో హెచ్.పి. మాలెట్ అనే ఆంగ్లేయ ఉద్యోగి కనుగొన్నారు. ఇక్కడ సంవత్సరమంతా ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే వర్షాకాలంలో ఇక్కడకు వెళ్ళకుండా ఉండటమే మంచిది. అక్టోబర్ నుంచి మే మధ్య కాలంలో వెళ్తే అక్కడి అందాలను కనుల విందుగా తిలకించగలుగుతాము. ఇక్కడ ముఖ్యమైన ప్రదేశాలు 30 దాకా ఉన్నాయి.

ఇక్కడ అన్నీ మట్టి రోడ్లే కన్పిస్తాయి. వాటన్నింటికీ దాదాపుగా ఆంగ్లేయుల పేర్లే ఉన్నాయి. ఇక్కడ లౌసియా పాయింట్, హనీమూన్ పాయింట్, ఇకో పాయింట్, లార్డ్ పాయింట్, పనోరమా పాయింట్, సన్‌సెట్ పాయింట్ వంటి చూడదగ్గ ప్రదేశాలు అనేకం ఉన్నాయి. కొన్ని పాయింట్ల నుంచి చూస్తుంటే కనుచూపు మేర పచ్చటి తివాచీ పరచినట్లు లోతైన లోయలు దర్శనమిస్తాయి. ఇక్కడి మట్టి రోడ్ల పై వందలాదిమంది పర్యాటకులు, గుర్రాలు ప్రతి నిత్యం నడుస్తూ ఉండటం వల్ల దుమ్ము విపరీతంగా ఉంటుంది. అక్కడ మనకు కన్పించే ఏకైక కాలుష్యం అదొక్కటే. మండు వేసవిలో కూడా అక్కడి చెట్లు ఎంతో తాజాగా, ప్రకృతి సిద్ధమైన పచ్చదనంతో ఉంటాయి. ఇక్కడ ప్రకృతిలో ఎన్ని రకాల ఆకుపచ్చ రంగులు ఉంటాయో వాటన్నింటినీ చూడగలం. అయితే మేము వర్షాకాలం ముగియగానే వెళ్ళి ఉంటే మరింత పచ్చదనాన్ని, సెలయేళ్ళు, జలపాతాలను చూడగలిగేవారమనిపించింది.



ఈ పట్టణంలోకి మోటారు వాహనాలను, కార్లను అనుమతించరు. సొంత కార్లలో వచ్చిన వారు సైతం దస్తూరీ పాయింట్ వద్ద తమ కార్లను ఆపుకొని మాథేరాన్ లోపలికి కాలినడకన కానీ, గుర్రాలపై కానీ వెళ్ళ వలసిందే. ఈ ప్రాంతానికి కూడా ప్లాస్టిక్ బ్యాగ్‌లు, కోక్ డబ్బాల బెడద మొదలయింది. ప్రభుత్వం, పర్యాటక శాఖ మరింతగా శ్రద్ధ తీసుకొని ఈ ప్రాంతంలో వాటిని అనుమతించకుండా ఉంటే ప్రకృతి అందాలతో అత్యంత స్వచ్ఛంగా, కాలుష్యరహితంగా ఉన్న ఈ ఒక్క ప్రదేశాన్నైనా కాపాడుకోగలుగుతాము. పర్యాటకులు కూడా దీన్ని కాలుష్యరహితంగా ఉంచడంలో తమ వంతు పాత్రను పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎప్పుడైనా ముంబాయి వేళ్తే ఈ కాలుష్య రహిత ప్రాంతాన్ని తప్పకుండా దర్శిస్తారుగా! ◆

ఒక చోట మలుపు తిరుగుతున్న రైలు



రోజురోజుకూ క్షీణిస్తున్న క్రీడాస్ఫూర్తి


స్టీవ్‌వా

* లిఖిత నర్వనేని

వరల్డ్‌కప్ క్రికెట్ పోటీలు జరుగుతున్నప్పుడు ఒకసారి క్రీడాస్ఫూర్తి గురించి చర్చించుకున్నాం. ఆస్ట్రేలియా జట్టు దుందుడుకు తనాన్ని ప్రత్యేకంగా ఆ జట్టు కెప్టెన్ పాంటింగ్ వ్యాఖ్యల గురించి అప్పటి వ్యాసంలో చూసాం. ఇంత త్వరగా క్రీడా స్ఫూర్తి గురించి మళ్లీ చర్చించుకోవాల్సి రావడం దురదృష్టకరమే. ఈ సారి క్షీణిస్తున్న క్రీడా స్ఫూర్తికి కారణం ఆస్ట్రేలియా జట్టే కావడం శోచనీయం.

క్రికెట్‌లో క్రీడాస్ఫూర్తి నశించి చాలా రోజులే అవుతుంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లు మంచిగా ఆడుతున్న ప్రత్యర్థులను మాటలతో వేధించడం చాలా కాలం నుండి చూస్తున్నాం. క్రమేణా ఈ అలవాటు దాదాపు అన్ని దేశాలకు పాకింది. అయితే ఆసియా ఖండంలోని దేశాలకు ఇందులో మినహాయింపు ఉంది. భారత్, పాక్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు గతంలో ప్రత్యర్థులను మాటలతో వేధించనప్పటికీ ఇప్పుడిప్పుడే వీటికీ ఆ అలవాటు పాకింది. ఇక ఆస్ట్రేలియా విషయానికొస్తే తాజాగా వెస్టిండీస్ పర్యటనలోనూ తన దురుసుతనాన్ని ప్రదర్శించింది. ఈ రెండు జట్ల మధ్య ఇటీవల జరిగిన ఒక టెస్టు మ్యాచ్‌లో ఆసీస్ కెప్టెన్ స్టీవ్‌వా, విండీస్ కెప్టెన్ బ్రియాన్ లారా మధ్య వివాదం చెలరేగింది. ఇద్దరూ పిచ్‌పై నిలుచుని దూషించుకుంటుంటే అంపైర్లు ప్రేక్షక పాత్ర వహించాల్సి వచ్చింది. లారా ఆసీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొనడమే వివాదానికి కారణం. అయితే ఇక్కడ గొడవపడ్డ ఇద్దరూ బాగానే ఉన్నారు. వివాదాన్ని నివారించలేనందుకు అంపైర్లు బర్డ్, వెంకటరాఘవన్‌లను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మందలించింది. అదే మ్యాచ్‌లో విండీస్ బ్యాట్స్‌మన్ రామ్ నరేష్ శర్వాన్, మెక్‌గ్రాత్‌ల మధ్య చోటు చేసుకున్న వివాదాన్ని ఐసిసి చూసీచూడనట్లు వదిలేసింది. మెక్‌గ్రాత్ పత్రికాముఖంగా తన తప్పును ఒప్పుకున్నప్పటికీ ఆవేశంలో దురుసుగా ప్రవర్తించిన మచ్చ చెరిగిపోదు.


మెక్‌గ్రాత్

ఆస్ట్రేలియా పత్రికలు కూడా తమ ఆటగాళ్ల దురుసుతనాన్ని విమర్శిస్తూ కథనాలు ప్రచురించడం విశేషం. దురుసుతనంగా ప్రవర్తించిన తమ ఆటగాళ్లకు లారా బృందం సరైన గుణపాఠం చెబుతుందని ఆసీస్ పత్రికలు అప్పుడే హెచ్చరించాయి. అనూహ్యంగా ఆసీస్ పత్రికలు భావించినట్టే విండీస్ వరల్డ్ రికార్డు విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ రెండు నెలల్లోనే వివిధ క్రీడల్లో పాల్గొన్న ఆస్ట్రేలియా క్రీడాకారులు అనేక మంది దురుసుగా ప్రవర్తించి పత్రికల పతాక శీర్షికలకెక్కారు. దీనితో ఆస్ట్రేలియా మీడియా వారి దేశపు ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తి మంటగలుపుతున్నారంటూ తీవ్రంగా విమర్శలు గుప్పించింది. ఎప్పుడూ తమ ఆటగాళ్ల దురుసు ప్రవర్తనను వెనుకేసుకొచ్చే ఆసీస్ పత్రికలు కూడా తమ ఆటగాళ్ల ప్రవర్తనలకు విసిగిపోయాయంటేనే ఆసీస్ ఆటగాళ్ల ప్రవర్తన ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వరుస విజయాలు సాధిస్తున్నప్పటికీ ఆసీస్ క్రికెటర్లలో క్రీడాస్ఫూర్తి కొరవడటంతో విజయాలకు తగిన ఆదరణ లేకుండా పోతోంది. గెలుపు బాటలో నడుస్తున్న జట్టు కూడా ప్రత్యర్థులపై నోరు పారేసుకోవడం చూస్తే వారికి విజయంతో కళ్లు నెత్తికెక్కినట్లు కనిపిస్తోంది.

ఇటీవల విండీస్ పర్యటనలో ఆసీస్ ఆటగాళ్లు ప్రత్యర్థుల ఏకాగ్రతను దెబ్బతీయడానికి వాడిన పదాలు చూస్తే ఆసీస్ ఆటగాళ్లకు నైతిక విలువల పట్ల ఎంత గౌరవం ఉందో తెలుస్తుంది. 'ఇంట్లో చెప్పి వచ్చావా గురూ', 'ఇంటికి వెళ్లాలని లేదా' ఇంకా పత్రికల్లో రాయలేని వ్యాఖ్యలు చేశారు.

ఇదిలా ఉంటే పాక్ ఆటగాడు షోయబ్ అక్తర్ బాల్‌ట్యాంపరింగ్ వివాదంలో ఇరుక్కున్నాడు. పాక్ ఆటగాళ్లు బాల్‌ట్యాంపరింగ్‌కు పాల్పడటం కొత్తేమీ కాదు. ప్రత్యర్థులను సులువుగా ఔట్ చేయాలని ఇలా క్రీడా స్ఫూర్తిని మరచి బంతి ఆకారాన్ని ఉద్దేశ పూర్వకంగా మార్చిన అక్తర్ స్వల్ప శిక్షతో బయటపడ్డాడు.

శ్వేత జాతీయులకు శిక్ష లేదా?

తెల్లజాతి వారు క్రికెట్‌లో దురుసుగా ప్రవర్తిస్తే శిక్షలేకుండా బయటపడుతున్నారు. ఆసియా ఖండానికి చెందిన ఆటగాళ్లు మాత్రం చేయని నేరాలకు కూడా శిక్ష అనుభవించాల్సి వస్తుంది. ఎల్‌బిడబ్ల్యు అప్పీలు గట్టిగా చేసిన కారణానికి గత ఏడాది ఆరుగురు భారత అగ్రశ్రేణి ఆటగాళ్లు సస్పెన్షన్‌కు గురయ్యారు. బంతిపై మట్టిని తీసివేస్తున్న సచిన్‌ను ఏకంగా బాల్ ట్యాంపరింగ్ చేస్తున్నాడని అవమానించిన ఐసిసి స్టీవ్‌వా, లారా విషయంలో మౌనంగా ఎందుకు ఉందో అర్థం కాని విషయం. స్టీవ్‌వాను శిక్షించాల్సి వస్తుందనే ఉద్దేశంతో లారాను కూడా విడిచిపెట్టారు. పైగా ఆటలో వివాదాలు సహజమని ఐసిసి కితాబిచ్చింది. ఐసిసి కూడా ఆసియా సంతతి క్రికెటర్లపై శిక్షలు వేసినంతగా ఇతరులపై విధించడానికి భయపడుతుంది. ఐసిసి చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇంగ్లీషు, ఆసీస్ ఆటగాళ్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఆటగాళ్ల దురుసు ప్రవర్తనకు పూర్తి బాధ్యత ఐసిసిదే అనడానికి సందేహం అక్కర్లేదు. ఈ రెండేళ్ల కాలంలో కేవలం ఇద్దరు ఆసీస్ ఆటగాళ్లు మాత్రమే దురుసు ప్రవర్తన కారణంగా ఐసిసి ఆగ్రహానికి గురయ్యారు. ఇతర దేశాల వారు అనేక మంది ఐసిసి ఆగ్రహానికి గురవడమే కాక శిక్షలు కూడా అనుభవించారు. ఆసీస్ ఆటగాళ్లంటే ఐసిసికి వల్లమాలిన అభిమానం ఎందుకో అర్థంకాని విషయం. ఆసీస్ ప్రజలు సైతం విండీస్‌లో తమ క్రికెటర్ల దురుసు ప్రవర్తనపై విమర్శలు గుప్పించినప్పటికీ ఐసిసికి ఆటగాళ్ల ప్రవర్తనపై విసుగురాకపోవడం విశేషం.

కొసమెరుపు

రానున్న రోజుల్లో నోటి దురుసుతనం స్థానంలో చేతి దురుసుతనం వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరంలేదు. ఆటగాళ్ల ప్రవర్తన రోజురోజుకూ ఇలా దిగజారుతుంటే ఏదో ఒకరోజున మైదానంలోనే ఆటగాళ్లు కొట్టుకునే అవకాశం ఉంది. ఇలా కొట్టుకునే సంస్కృతి ఫుట్‌బాల్ క్రీడలో ఇప్పటికే ప్రవేశించింది. ఇది క్రికెట్, ఇతర క్రీడల్లో ప్రవేశించకుండా చూస్తే మంచిది. ◆



* అత్తలూరి విజయలక్ష్మి

తెల్లవారింది.
మరోసారి బద్ధకంగా ఆవలించి పక్కకి ఒత్తిగిలి పడుకుంది శాంతి.
తెల్లవారిందని మరోసారి రుజువు చేస్తూ వెలువడిందో శబ్దం.
శాంతిచప్పున మంచం మీద లేచి కూర్చుని, కిటికీ రెక్క కొద్దిగా తెరించింది.
నిజంగానే తెల్లవారింది.
కానీ రోజూలా కాదు.

నిర్ణయం

"నాయనా! నా తండ్రీ నీకప్పుడే నూరేళ్ళు నిండాయా? నాకింక దిక్కేది బాబూ!" అని విలపిస్తోందో మాతృమూర్తి.

"నా బ్రతుకంతా చీకటి చేసి పోయావు కదయ్యా! నేనేం కావాలి? ఈ పిల్లల్ని ఎట్లా పెంచాలి? నేనెట్టా బతకను?' భర్త మృతదేహాన్ని ప్రశ్నిస్తోందో ఇల్లాలు.

శాంతి చివ్వున మంచం మీద నుంచి లేచి, వీధి వాకిట్లోకి వచ్చింది.

ఎదురింటి వాకిట్లో చాపమీద పడుకో బెట్టబడి ఉంది ఓ శవం. శాంతి గబగబా అక్కడికెళ్ళింది. శాంతిని చూస్తూనే దుర్గమ్మ బావురుమంది.

"శాంతమ్మా! నా బిడ్డకి నూరేళ్ళు నిండాయి తల్లీ. రాత్రి డ్యూటీ నుంచి వస్తుంటే లారీ గుద్దేసింది. రాత్రంతా ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుకుని చచ్చిపోయాడు".

శాంతి ౹మాన్పడిపోయింది. నిన్న సాయంత్రం డ్యూటీకెళ్ళేటప్పుడు వచ్చి తనను కలిశాడు సత్యం. మనియార్డరు చేసిన రసీదు ఇచ్చివెళ్ళాడు. ప్రతినెలా అమ్మా వాళ్ళకి తను సత్యం ద్వారానే మనియార్డరు పంపిస్తుంది. అంతేకాదు తనకెంతో సాయం చేస్తాడు సత్యం. 'చెల్లెమ్మా! చెల్లెమ్మా!' అంటూ తన బిడియాన్ని పోగొట్టి ఎంతో ఆప్యాయత చూపించే సత్యం, నిర్జీవంగా పడి ఉన్నాడు. అతని చుట్టూ తల్లి, పిల్లలు, భార్య, బంధువులు కూర్చుని ఏడుస్తున్నారు. తండ్రి దూరంగా కండువాలో మొహం దాచుకుని నిల్చున్నాడు. సత్యం మంచితనాన్ని నలుగురికి సాయపడే అతని తత్వాన్ని బంధువులంతా గుర్తు చేసుకుంటూ మరీ ఏడుస్తున్నారు.

శాంతి మనసు కలిచివేసినట్లయింది. గుండె భారంగా అయింది. నెమ్మదిగా వెళ్ళి సత్యం భార్యని, తల్లిని చెరోచేత్తో దగ్గరికి తీసుకుంది. శాంతి ఒంటరిగా ఈ జీవనం సాగించటం మొదలు పెట్టిన ఈ ఏడాదిలో తనను కంటికి రెప్పలా చూసుకుంటూ, ఆప్యాయతను పంచి ఇచ్చి, తల్లిదండ్రులను, తోబుట్టువులను మరిపించిన కుటుంబం. చేతికంది వచ్చిన కొడుకు పోయిన దుర్గమ్మ హృదయ విదారకంగా ఏడుస్తోంది. అతని భార్య అంధకార బంధురమైన తన భవిష్యత్తులో పిల్లలకి దారి కనిపించక కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది.

ఈ పరిస్థితుల్లో ఆ బాధార్తులను ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు శాంతికి. రాత్రి తను ఫ్రెండ్స్‌తో సెకండ్‌షో సినిమాకెళ్ళి వచ్చి నిద్రపోయింది. దుర్గమ్మ ఇంట్లో ఇంత విషాదకరమైన సంఘటన జరిగిందని ఇప్పుడే తెలిసింది. శాంతికి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. మంచివాళ్ళకే అకాల మరణం సంభవిస్తుందేమో! నెమ్మదిగా రుద్ధమైన కంఠంతో అన్నది.

"లే దుర్గమ్మా! నువ్వే ఇలా బాధపడితే ఆ అమ్మాయిని ఓదార్చే వాళ్లెవరు? నువ్వేడ్చినంత మాత్రాన అతను బతికొస్తాడా? లే ధైర్యం తెచ్చుకో! చూడు. వాళ్ళంతా ఎలా ఏడుస్తున్నారో! పద లోపలికి. లేవాలి మరి.'' అసహజంగా అనిపిస్తున్నా, ఎలాగో ఓదార్చటానికి ప్రయత్నించింది శాంతి. ఆమెకి తెలుసు. తన ఓదార్పు అర్థం లేనిదని, సత్యం మరణం ఆ కుటుంబానికి గొడ్డలి పెట్టు. అతని మీద ఆధారపడి బతుకుతున్న ఆ ఐదు ప్రాణాలకు దిక్కెవరు? అన్నది ముందున్న మహాసమస్య. "ఎట్లా తట్టుకోను తల్లీ, ఎట్లా తట్టుకోను" గుండెలు పగిలేలా ఏడుస్తూ అన్నది. సత్యం అత్తగారు భోరున ఏడుస్తూ "నా బిడ్డ పాతికేళ్ళకే పసుపు కుంకుమలకు దూరమైంది తల్లీ" అంటూ గొల్లుమంది.

ఆ రోజు జరగవలసిన తతంతం అంతా ఏదో వాళ్ళ పద్ధతి ప్రకారం జరిపించారు. సత్యం కొడుకు పదేళ్ళ వాడు శవం వెనకాల కుండలో నిప్పు తీసుకెళ్ళటం, శవాన్ని ఊరేగింపుగా తీసుకెళ్ళటం,

దారిలో అందరూ గట్టిగా ఏడవడం — ఇదంతా అయోమయంగా అనిపించింది.

"దినకర్మలకి బోలెడు డబ్బు కావాలి. బంధువులంతా వస్తారు" అంది సత్యం తల్లి. శాంతి తెల్లపోయింది. "దినకర్మలేవిటి? బంధువులంతా రావడమేవిటి?"

"దినాలు చేయాలి కదమ్మా. పదోరోజు పదకొండోరోజు, పన్నెండో రోజు మూడు రోజులు చేయాలి. బంధువులంతా ఈ మూడు రోజులుంటారు. పదోరోజు మా కోడలికి పసుపు కుంకుమలు తీసేస్తాము.

శాంతి నిలువెల్లా వణికిపోయింది. ఎప్పుడో ఒక తెలుగు సినీమాలో చూసింది. భర్తపోయిన నాయికకి ఆడవాళ్ళంతా కలిసి నీళ్ళు పోసి, గాజులేసి మరీ పగల కొట్టడం, బొట్లు పెట్టి మరీ తుడిపేయటం, ఇలాంటి దారుణాలు నిజంగా ఈ సమాజంలో ఇంకా జరుగుతున్నాయా?

"ఎంత మోటు పద్ధతులివి? వీటినా సంప్రదాయాలనేది? సమాజం మారిందన్నారే! మరి ఎక్కడ? ఈ దుర్గమ్మ ఏవిటి ఇలా మాట్లాడుతోంది?... లేదు అలా జరగటానికి వీలు లేదు. దుర్గమ్మకి తెలీదు కాబోలు" శాంతి కొంచెం గట్టిగా అరిచింది.

"లేదు దుర్గమ్మా! అదంతా చేయనవసరం లేదు. వచ్చిన డబ్బు బాంక్‌లో దాచి పిల్లల చదువులకు ఉపయోగించండి. మీ అబ్బాయి పని చేసిన చోట మీ కోడలికి ఉద్యోగం ఇస్తారు. ఆ అమ్మాయి ఆ ఉద్యోగం చేసుకుంటూ నాలుగక్షరం ముక్కలు నేర్చుకొంటుంది. తన కాళ్ళమీద తాను నిలబడుతుంది. ఇవన్నీ చాదస్తాలు దుర్గమ్మా! ఈ కాలంలో కూడా ఇంకా ఇలాంటి నమ్మకాలతో డబ్బు వృధా చేయకూడదు."

"మీరంతా చదువుకున్న వాళ్ళు తల్లీ! మీకు తప్పు అయినవి మాకు ఒప్పు. మాకు ఒప్పుఅయినవి మీకు తప్పు. ఇదంతా చేయకపోతే, మా బంధువులంతా మమ్మల్ని ఆడిపోసుకుంటారు. పిల్లాడు పోయి నాలుగు రోజులన్నా కాకుండా వాడిని మర్చిపోయామంటారు. అయినా నా కొడుకుకు కావలసిన వాళ్ళం మేమంతా బతికి ఉండి వాడిని అనాధ శవం లాగా తగలేసి ఊరుకోలేం కదమ్మా!"

రెండు మూడు రోజులు గడిచిపోయాయి. శాంతి యథా ప్రకారం ఆఫీసు నుంచి రాగానే ఆ ఇంటికెళ్ళి వాళ్ళకు కావాల్సిన సాయం చేస్తూనే ఉంది. ఎంతో ప్రయత్నించిన మీదట సత్యం భార్య భారతితో మాట్లాడే అవకాశం కలిగింది.

నెమ్మదిగా, తనకు జరగబోతున్న అన్యాయపు తంతు తెలియని దానిలా, నిర్లిప్తంగా ఉంది భారతి. వంటింట్లో కూర్చుని ఆమెకు అన్యాయం వివరించి, ఆ ఆచారాన్ని ప్రతిఘటించమని ఆవేశంతో చెప్పింది శాంతి.

అంతా విన్న భారతి నీరసంగా అన్నది. "నా వల్ల కాదు శాంతక్కా! నాకంత ధైర్యం లేదు. అయినా ఎప్పటి నుంచో జరుగుతోన్న పద్ధతులను నా కోసం మారుస్తారా? అమ్మా, అత్త, అక్కలు, వదినలు ఎవరూ ఒప్పుకోరు. నేను గొడవ చేస్తే, బొట్టుకోసం ఏడుస్తున్నావని, మొగుడు పోయినా ఫర్వాలేదు బొట్టుకావాలా? అని నా మాటలంటారు. అంతకన్నా వాళ్ళేం చేసినా భరించవచ్చుకాని తట్టుకోలేను మరిది."

"అలా అనుకుంటే ఎలా భారతీ? నీలాగే అందరూ అనుకుంటారు. నీ అత్తగారూ అందరూ సంఘానికి భయపడి ఆచారాలనుకుంటారు. ఇలాంటి ఆచారాలు పెడుతున్నారు. నీలాగే అత్తలకు, అమ్మలకు, అక్కలకు, అమ్మలక్కలకు భయపడే అందరూ వాళ్ళ పనిని సమర్థిస్తున్నారు. ఇలా ప్రతి వాళ్ళూ ఎదుటి వాళ్ళకు భయపడుతూ ఉంటే ప్రగతి అనేది ఎలా సాధ్యమవుతుంది? సంఘం, సంఘం అంటారు. ఇలా భయపడేవాళ్ళంతా ఈ సంఘంలోని మనుషులేగా. పది మంది భారతులు, ఇరవై మంది దుర్గమ్మలు, ఇంకా కొందరు మల్లమ్మలు, ఎల్లమ్మలు వీళ్ళందరి కలయికే ఒక సంఘం. అలాంటి సంఘానికా మీరంతా భయపడేది? ఎంత విషాదం! ఇలాంటి పనులు నీ ఒక్క

దానికి అవమానం కాదు. మొత్తం స్త్రీజాతికే అవమానం. పది మంది ఆడవాళ్ళు కలిసి నీ బొట్టు చెరిపేయడమనే సంప్రదాయం. సంప్రదాయం కాదు. నీచత్వం, అమానుషత్వం, ఈ మనుషుల కుళ్లు మనస్తత్వానికి ప్రతిబింబం. నువ్వు దీనిని ప్రతిఘటించాలి. నా మాట విను భారతీ.."

"నేను నీలాగా పెద్ద చదువులు చదువుకోలేదు శాంతక్కా! నువ్వు మాట్లాడేవన్నీ పెద్ద పెద్ద మాటలు. అవన్నీ నాకర్థం కావు. నేనింతే, నా బతుకింతే, ఆయనే చనిపోయాక నాకు బొట్టు అంత ముఖ్యం కాదు. నేనెలా ఉంటే ఏం! నా బిడ్డల్ని పెద్దవాళ్ళను చేస్తే చాలు."

భారతి వెక్కివెక్కి ఏడ్చింది నిస్సహాయంగా. శాంతి ప్రయత్నాలన్నీ విఫలం అయినాయి. ఆ రోజు రానే వచ్చింది. ఎదురింట్లోంచి శోకాలు, గుండె చెదిరిపోయేలా వినిపిస్తున్నాయి. దురదృష్టవశాత్తు ఆ రోజు ఆదివారం. శాంతి ఇంట్లోనే ఉంది. ఎలాగైనా ఆ సంఘటన జరక్కుండా ఆపాలని ఇంట్లోనే ఉండిపోయింది.

పక్కింట్లో ఉంటున్న సునంద దగ్గరకెళ్ళింది శాంతి. సునంద, ఆమె కొడుకు ఉంటున్నారు. సునంద బ్యాంక్‌లో పని చేస్తోంది. శాంతిని చూడగానే, రండి రండి శాంతగారూ కూర్చోండి" అని ఆహ్వానించింది సునంద.

"సునందగారూ, ఈ రోజు ఎదురింట్లో చాలా ఘోరం జరగబోతోంది తెలుసా?" అడిగింది శాంతి.

"ఏవిటండీ అది?" గాభరాగా అడిగింది సునంద.

"సత్యం పోయాడు కదండీ. ఇవాళ పదోరోజు. పాపం భారతికి బొట్టు తీసేయడం అలాంటివేవో చేస్తారట."

"అదా! ఏవిటో అనుకున్నాను. అది మామూలే కదండీ!" తేలిగ్గా అన్నది సునంద. అదిరిపడింది శాంతి. ఎంత ఈజీగా అంటోంది. ఈమె చదువుకుని ఉద్యోగం చేస్తోన్న సునందేనా?

"కానీ, ఇంకా మన సమాజంలో ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయంటే నాకు చాలా బాధగా ఉందండీ" అంది.

"బాధే కాని, ఏం చేస్తాం? మనకు కొన్ని కస్టమ్స్ ఉన్నప్పుడు వాటిని ఫాలో అవ్వాలిగా. ఏం చేస్తాం" శాంతికి అసహ్యం వేసింది. కస్టమ్సట. దానికో భాష ఎరువు తెచ్చుకోడం కూడా.

"అందుకే నేనివాళ మా అమ్మగారింటికి వెళ్ళాలనుకుంటున్నాను".

"దేనికి?" విచిత్రంగా అడిగింది శాంతి.

"దేనికేవిటండీ? మీరు వట్టి అమాయకురాల్లా ఉన్నారే. ఎల్లుండి భారతి మొహం చూడకూడదు. పొరపాటున కనిపిస్తే ఎలా? పైగా మంగళవారం కూడాను. మీరు కూడా చూడకండి పెళ్ళి కావాల్సిన వారు.

"ఆమెని చూస్తే నాకు పెళ్ళి కాదంటారా? చదువుకున్న వాళ్ళు మీరు కూడా ఇలా మాట్లాడటం నాకు బాధగా ఉంది".

"మీకు నమ్మకం లేదా? ఏం? పెద్దవాళ్ళు ఊరికే అనలేదండీ. ఏదో లేకపోతే ఇలాంటి రూల్స్ అన్నీ ఎందుకు పెడతారు? మాంగల్యం ఉంటేనే స్త్రీకి రక్షణ, గౌరవం." అంటూ మెళ్ళో మంగళ సూత్రాలు కళ్ళకద్దుకుంది.

"అయినా, మీ పిచ్చిగాని, మనం గొంతు చించుకున్నంత మాత్రాన, అన్నీ మనం అనుకున్నట్టు జరుగుతాయా? వ్యక్తుల్లో మార్పురావాలి. సంస్కారం ఉండాలండీ ఇలాంటి సంస్కరణలు రావడానికి. అయినా ఆమె బొట్టు తీయనంత మాత్రాన మనమంతా ఆమెని ముత్తయిదువగా అంగీకరించి బొట్టు పెట్టగలమా?" సునంద రాగం తీస్తూ అన్నది.

ఎంత హిపోక్రసీ! సంస్కారం కావాలిట. సంస్కారంలో ఎన్ని అక్షరాలు ఉన్నాయో కూడా తెలీని సునంద సంస్కారం గురించి మాట్లాడుతోంటే రోత పుట్టింది. నిరసనగా అన్నది.

"పెట్టగలమా? అనకండి. నేను

(మిగతా 22వ పేజీలో)

వినాశనానికి దారితీస్తున్న ప్రపంచీకరణ

భారతదేశంలో
ప్రపంచీకరణ పర్యవసానాలు
రచన : ఎం.వి.కృష్ణయ్య,
ప్రచురణ : ఎ.పి.టీచర్స్ ఫెడరేషన్,
ప్రకాశం జిల్లా శాఖ, **వెల** : రు.20/-;

సామ్రాజ్యవాదం దోపిడి కోసమే ప్రపంచీకరణ. రోజురోజుకు విస్తరిస్తున్న ఈ ప్రపంచీకరణ అనే మహమ్మారి అసలు రూపాన్నీ, దాని సారాన్నీ, అందులోని వాస్తవాలను శ్రామికవర్గ దృక్పథంతో వివరంగా విశ్లేషించడంలో ఈ వ్యాసాలకున్న ప్రాముఖ్యత ఎనలేనిది.

భారతదేశ సార్వభౌమత్వాన్ని సవాలు చేసే విధంగా రూపొందిన గాట్ ఒప్పందం స్వదేశీ పరిశ్రమల మూసివేతకు - విదేశీ వస్తువుల గుమ్మరింపుతో మన మార్కెట్ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుంది. మనలాంటి బడుగు దేశాలకు గాట్ ఒప్పందం ఉరితాడులా మారింది. దేశంలోకి అనుమతించిన బహుళజాతి సంస్థలు పెట్టుబడులు తెస్తాయనీ, స్వదేశీ వస్తువులకు పోటీ ఇస్తాయని ప్రచారం చేసినా అది అంతా అబద్ధం. అవి దేశీయ పరిశ్రమలు ఎలా నాశనం చేస్తాయో వివరిస్తూ, అందుకు ఉదాహరణగా బహుముఖ దోపిడీకి పాల్పడుతూ దేశ ప్రజానీకాన్ని కొల్లగొడుతున్న హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్ ధనదాహాన్ని, వ్యాపార విస్తరణను తెలియజేశారు. ఇందులో భాగంగా దేశీయ చమురు వనరులను, ప్రభుత్వ ఆయిల్ సంస్థలను కారుచౌకగా బహుళజాతి సంస్థలకు, బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్న రాజకీయాల కుట్రను కూడా మనం గమనించాలి. ప్రైవేటీకరణ పేరుతో లాభాల్లో వున్న ప్రభుత్వరంగ సంస్థలను కూడా చౌకలో వదిలించుకోవడంలో వున్న అవినీతిని ప్రశ్నించే వారే లేరు. ఇన్సూరెన్స్-బాంకింగ్ రంగాలను ప్రైవేటీకరించమనే ఒత్తిడుల వల్ల మన ఆర్థిక సార్వభౌమత్వమే ప్రమాదంలో పడనున్నాయి. మూడవ ప్రపంచ దేశాలలో తాము స్వేచ్ఛగా పెట్టుబడులు పెట్టుకునే హక్కు, సర్వీసుల రంగంలో చొరబడే హక్కు, వచ్చిన లాభాలను తరలించుకొని వెళ్ళే హక్కు ఉండాలంటూ స్వైర్యాగానం చేస్తారు. అయితే శాస్త్ర సాంకేతిక రంగాలలోని విజ్ఞానం పేద దేశాలకు అవగింజంత కూడా బదిలీ కారాదని, అవి ఆ విషయంలో తమ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండాలనీ, తాము సృష్టించిన విజ్ఞానాన్ని కొంచెం ఆలస్యంగానైనా ఈ పేద దేశాలు స్వతంత్రంగా రూపొందించుకోవడానికి సైతం వీలులేని విధంగా చట్టాలు రూపొందించాలని కోరుతున్నాయి. బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా ఉండి పేటెంట్ చట్టాన్ని అమలు చేయడంలో మన రాజకీయ పార్టీలు చూపిన ఆత్రం, దేశప్రయోజనాల పరిరక్షణలో కనబరచకపోవడం విచారకరం. నల్లధనాన్ని తెల్లధనంగా మార్చిన వి.డి.ఐ.ఎస్.-97 పథకం గానీ, హవాలా విశ్వరూపంగానీ మన ఆర్థిక వ్యవస్థలోని లోపాలను, లొంగుబాట్లను సూచిస్తాయి. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల్లో సరళీకృత ఆర్థిక విధానాల వల్ల అక్కడ సంభవించిన ఆర్థిక రాజకీయ అస్థిరత్వాన్ని, సంక్షోభాన్ని చూసి కూడా మనవాళ్ళు జాగ్రత్తపడకపోవడం మరింత విచారకరం. చివరగా ఎం.వి.కృష్ణయ్య రాసిన ఇరాక్, పాలస్తీనాపై వ్యాసాలు అమెరికన్ సామ్రాజ్యవాదపు నిస్సిగ్గు రాజకీయాలను, తన దోపిడీ రాజకీయాల కొనసాగింపుగా యుద్ధాస్త్రాన్ని వాడుతున్న తీరును, ప్రజాస్వామ్యమ్ము, మానవ హక్కులు, సార్వభౌమాధికారాలు-సామ్రాజ్యవాదం దృష్టిలో దూదిపింజలేనన్న వాస్తవాన్ని సముచితంగా ఎత్తి చూపాయి. ఎం.వి.కృష్ణయ్య వ్యాసాలు సామ్రాజ్యవాదపు తక్షణ ప్రమాదాన్ని వివరించడంతో పాటు, దాన్ని మనం ఎందుకు వ్యతిరేకించాలో తెలియజేస్తాయి.

*** కె.పి.అశోక్ కుమార్**

ఆలోచింప జేసే 'వేకువ పిట్ట'



వేకువపిట్ట (హైకూలు)
రచన : రౌతురవి; **వెల** : రు.20/-
ప్రతులకు : రౌతురవి (టీచర్),
ఇ.నెం. 3-2-44/1, ఇందిరానగర్
కాలనీ, ఖానాపురం హవేలి, ఖమ్మం.

'హితం' పరమార్థం గల ఏ సాహిత్య ప్రక్రియ అయినా మెచ్చదగిందే. అది కథ, కవిత, మినీకవిత, హైకూ. ఏదైనా కావచ్చు. కవి/రచయిత తన భావ వ్యక్తీకరణకు, తీసుకున్న వస్తువుకు చక్కని శిల్పం ఒనగూడితే ఏ ప్రక్రియైనా వర్ధిల్లుతుంది. ఆ క్రమంలోనే ఈ మధ్యకాలంలో కవి, రచయిత రౌతు రవి 'వేకువ పిట్ట' వచ్చింది. 'కళ కళకోసం కాదు ప్రజల కోసం' అని బలంగా నమ్మిన రవి 'వేకువపిట్ట'లో ఎక్కడా స్వార్థం కనిపించదు. తను నమ్మిన సిద్ధాంతం, తను పుట్టిన మధ్య తరగతి మూలాలు, మట్టివాసనలు, పల్లె అమాయకత్వం ఏ అక్షరాన్ని తడిమినా కనిపిస్తాయి.

పత్తి పంటకు సెలవిద్దాం/ బట్టలొద్దంటున్నాయి/టీవీలు, మూవీలు!/ ఈ పుస్తకంలో మొత్తం 39 పేజీల్లో వంద రసగుళికలు చక్కని కార్టూన్లతో నిండుకొని ఉన్నాయి. ఇందులో చదవగానే ఓహో అనిపించేవి కొన్ని, ఆహా అనిపించేవి కొన్నయితే, కలకాలం మన మనస్సులో నిండుకొని పదిలంగా ఉండేవి కొన్ని. అలాంటి వాటిల్లో కొన్నింటిని చూద్దాం.

ఓట్లని నోట్లుగా మార్చే/ మిషన్/ప్రజాస్వామ్యం!/ఇంతకన్నా ఎక్కువ, తక్కువలు కల్పించడం వీలుకానంతగా నేటి సోకాల్డ్ రాజకీయాన్ని వ్యక్తీకరించాడు కవి. ఏ పేపర్లో చూసినా రైతుల, కూలీల వలస జీవితాల వ్యథలు కథలు కథలుగా కనిపిస్తున్నాయి. పనికోసం పట్నం పోతున్న కూలి బతుకుల వ్యథను వ్యక్తీకరించిన రీతి మనసుకు హత్తుకుంటుంది.

పల్లె నిద్రమానింది/పట్నంలో దూరి/పనికోసం/పాఠకుడు కనీసం పదిసార్లయినా మళ్ళీ మళ్ళీ చదువుకొని, తనకు ఆపాదించుకొనే ఇలాంటివి చాలా ఉన్నాయి.

రాష్ట్రంలో కరువు లేదని నివేదికల్ని తయారు చేసిన అధికార్లకు, ప్రసంగాలిచ్చిన నాయకులకు, ఇప్పుడు పొలాల్లో/విత్తనాలు మొలవట్లే/రైతుల శవాలే/ఇంతకన్నా ఏమని చెప్పాలో తెలియని అమాయకత్వం కనిపిస్తుంది ఈ 'హైకూ'ల్లో.

ప్రైవేటీకరణ, గ్లోబలీకరణ, కరువు, విద్యార్థి స్వేచ్ఛ, మధ్యతరగతి జీవుల ఆక్రందన, అమెరికా సామ్రాజ్యవాదం. ఒకటేమిటి ఇలా ప్రతి విషయం కవి చేతిలో కవితా వస్తువుల య్యాయి. ఈ స్పీడు యుగంలోనూ పాఠకున్ని ఓ క్షణంపాటు ఆపి చదివించుకోగల సత్తా ఈ 'వేకువ పిట్ట'ది. అంతేకాదు "ఎన్ని గజాలు రాశాడన్నది కాదు. ఎన్ని నిజాలు చెప్పాడన్నది ముఖ్యం" అన్న ఆరుద్ర మాటలకు సరిపడింది కూడాను.

చివరిగా ఓ మాట 'ఏకవర్ణ పదాలున్న జపనీభాషలో పేరొందిన ఈ 'హైకూ' ప్రక్రియ బహువర్ణాలున్న మన తెలుగుభాషకొచ్చే సరికి కవి భావ వ్యక్తీకరణలో బలహీనపడటం కొన్నిచోట్ల కన్పిస్తుంది!! రౌతురవి ఈ ప్రక్రియలో మరింత పరిజ్ఞానాన్ని పెంచుకొంటే పాఠకులకు మరింత సాహిత్యాన్ని అందివ్వగలడన్న విషయంలో సందేహం లేదు. సాహిత్యంలో వచ్చే మార్పుల్ని మరింత పరిశీలన చేయాల్సిన బాధ్యత కవిగా, రచయితగా, పాటగానిగా రౌతు రవికి ఉందన్న విషయాన్ని మరువడనే ఆశిద్దాం ఇక ముందుకూడానూ.

*** సైదులు ఐనాల**

నమూనాల 'కళ'లో నిష్ణాతుడు

పాండురంగాచారి

కృషి ఉంటే మనుషులు ఋషులవుతారంటారు. పురాణ గాథల్లో విశ్వామిత్రుడు సృష్టికి ప్రతిసృష్టి చేశాడని చెప్పుకుంటారు. అది నిజమో కాదోగాని తను చూసినదాన్ని తిరిగి యథాతథంగా సృష్టిస్తూ నమూనా కళలో అంతర్జాతీయ ప్రతిభ చూపుతూ 'కలియుగ విశ్వామిత్రుడి'గా కళాభిమానుల కితాబునందుకుంటున్న పెనుమూరి పాండురంగాచారి గురించి ఈ వారం తెలుసుకుందాం.



చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలం వికృతమాల గ్రామంలో 1961 సంవత్సరంలో కాంతమ్మ, శంకరాచారి దంపతులకు జన్మించిన పాండురంగాచారి ఎస్.ఎస్.సి పూర్తి చేసిన అనంతరం కార్పెంటర్‌గా తన జీవితం ప్రారంభించారు. కార్పెంటర్ వృత్తిలో ఇమడలేక తన అన్నగారి ప్రోద్భలంతో స్కూటర్ మెకానిక్ పనిలో చేరి, కొంతకాలానికి తిరుపతి పట్టణంలో స్వంతగా షెడ్‌ను నిర్వహించుకునే స్థాయికి ఎదిగారు. మరికొంత కాలానికి మెకానిక్ షెడ్‌ను మూసివేసి, ఔత్సాహిక నటీనటులకు శిక్షణనిచ్చే ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించి ఎందరో విద్యార్థులకు శిక్షణనిచ్చారు. ఇన్‌స్టిట్యూట్ నష్టాల్లో పడటం, తన తండ్రి మరణించడం పాండుర్ంగా చారిని మానసికంగా కృంగదీశాయి. తండ్రి జ్ఞాపకార్థం తనే తన తండ్రి విగ్రహాన్ని తయారు చేయడంతో ఆయన కళానైపుణ్యం బయటపడింది. ఇదే స్ఫూర్తితో అప్పట్లో విడుదలైన జురాసిక్ పార్క్ నమూనాలను చేయడం పలువురిని ఆకర్షించింది. సన్నిహితుల, శ్రేయోభిలాషుల ప్రోత్సాహంతో అప్పటినుండి నమూనా కళనే వృత్తిగా ఎంచుకొని రంగాచారి కృషి చేస్తున్నారు.

నమూనాల రూపశిల్పిగా రాణింపు

తన తల్లితో కలిసి తిరుమల తిరుపతి దేవుడి దర్శనానికి వెళ్ళిన సందర్భంలో ఎదురయిన సంఘటనే నమూనా కళలో మరింతగా రాణించడానికి కారణమని చెబుతూ దేవుని దర్శనం చేసే సమయంలో సెక్యూరిటీ వల్ల తన తల్లి క్రింద పడిపోవడంతో మనస్తాపానికి గురియై పట్టుదలతో దేవుని ప్రతిమను అచ్చుగుద్దినట్లు తయారు చేసి అమ్మకు ఇవ్వడం జరిగిందని ఆయన చెబుతారు. ఆ తర్వాత ఆనందనిలయంలో శ్రీవారి ఆలయాన్ని మొత్తం తన ఇంట్లోనే సృష్టించుకోవాలనే తలంపుతో రాత్రి పగలు తేడా తెలియకుండా కష్టించి వైట్‌సిమెంట్, హార్డ్ స్టోన్, కాపర్‌షీట్ ముడిసరుకుతో అసలా? నకలా? అన్నంతగా శ్రీవారి ఆలయాన్ని పాండురంగాచారి తయారు చేయడం జరిగింది. క్రమంగా దిన దిన ప్రవర్ధమానంగా నమూనా రూప కళలో పాండురంగాచారి రాష్ట్రవ్యాపితంగా పేరు సంపాదించారు.

ఆయన తలంపులో రూపుదిద్దుకున్న నమూనాలు

వెంకటేశ్వరుని ప్రతిమ, శ్రీవారి ఆలయం, అమెరికన్ డైమండ్స్ పొదిగిన ఆభరణాలు, శంఖు, చక్రాలు, కర్ణాభరణాలు, దేశనాయకుల విగ్రహాలు, దేవతామూర్తుల ప్రతిమలతో పాటు సామాజిక నేపథ్యంతో కూడిన మార్కెట్, స్కూల్ లాంటి భారీ ప్రతిమలను సైతం రంగాచారి సహజంగా తయారు చేశారు.

అవార్డులు, సత్కారాలు

శ్రీ విరాట్ విజ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కార్యనిర్వహణాధికారిచే అభినవ రూపశిల్పి, మైత్రీ వారిచే కలియుగ విశ్వకర్మ, తిరుపతి జూనియర్ ఛాంబర్‌వారి పురస్కారంతో పాటు అనేక సాంస్కృతిక సంస్థలచే సత్కారాలు పొందారు.

✻ చలపాక ప్రకాష్

- పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

గోరంత దీపం

రాములమ్మ ఒంటరిగా కూర్చొంది.

ఇంటిలో ఎవరూ లేరు. బంధువుల పెళ్ళికి వెళ్ళడంతో బోసిగా ఉంది. దూరంగా వాహనాల రాకపోకల చప్పుడు మాత్రం వినిపిస్తోంది. టైము ఎంతైందీ తెలీలేదు.

రాములమ్మకు అంతా చీకటిగా ఉంది. అప్పుడే కాదు. పుట్టినప్పటి నుంచి చీకటి తప్ప ఆమెకు మరేమీ తెలియదు.

'పుట్టుగుడ్డి' అంటూ తల్లిదండ్రులు బాధపడటం తెలును. 'దీనిని ఎవరు మనువాడతారో' అని ఆవేదన చెందడం తెలుసు.

అంతకుమించి రాములమ్మకు మరేమీ తెలియదు.

కాలం గడుస్తోంది... వయసు వస్తోంది.

జీవితం పట్ల ఆలోచనలు పెనవేసుకుంటున్నాయి.

ఇంతలో రిక్షా చప్పుడైంది.

"ఎవరూ?" రాములమ్మ ప్రశ్నించింది.

ఇంటి ముందుకు ఎవరో వచ్చారు అని తెలుస్తోంది. ఆ వచ్చింది ఎవరో తెలియలేదు... పక్కింటి పిల్ల 'మంగ' అంతవరకూ తన పక్కనే ఉంది. ఏమైందబ్బా?" అనుకుంది.

"కాస్త మంచినీళ్లిస్తావా?" రిక్షా అబ్బాయి అడిగాడు.

ఒక్కసారి రాములమ్మ తుళ్ళిపడింది.

లేచి ఇంటిలోకి వెళ్ళడానికి ప్రయత్నించింది. అప్పుడు మంగ దగ్గరికి వచ్చింది "ఏంటక్కా!" అంటూ.

"మంచినీళ్ళంట!" రాములమ్మ చెప్పింది.

మంగ లోపలికి వెళ్ళి చెంబుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

అప్పుడు స్పష్టంగా చూశాడు బొబ్బల చిన్నారావు.

ఆమె అంధురాలు.

నోటమాట రాలేదు. "ఏం అనుకోవద్దు... నిన్ను గమనించలేదు.. అందుకే నీళ్ళు అడిగాను-" సంజాయిషీ ఇస్తున్నట్లు అన్నాడు.

రాములమ్మ 'పర్వాలేదు లే...' అంది.

ఆమెను చూసిన తర్వాత చిన్నారావు మనసు గతి తప్పింది. ఆమె అంధ జీవితానికి తాను తోడుంటే ఎంతో బాగుంటుంది అనిపించింది.

అక్కడే రిక్షాను ఆపి అరగంట పిచ్చాపాటి మాట్లాడాడు. ఆమె కుటుంబం గురించి అన్ని సంగతులు తెలుసుకున్నాడు. విశాఖ జిల్లా దొవాడలో ఉంటున్న ఉరుకూటి అప్పల నర్సమ్మ పన్నెండు మంది సంతానంలో రాములమ్మ ఆఖరిది.

"నువ్వేం చేస్తుంటావు?" అడిగింది.

"రిక్షా లాగుతాను... రోజుకు ఇరవై ముప్పయి సంపాదిస్తాను.... నాకు అందరూ ఉన్నా ఎవరూ లేనట్టే. నా రిక్షాలాగే జీవితం కూడా సాగిపోతోంది-" చెప్పాడు చిన్నారావు.

"ఎక్కడ రిక్షా ఏస్తుంటావు?"

"ఇటువైపు చాలాసార్లు వస్తుంటాను."

యుక్త వయసు వచ్చిన తర్వాత వయసొచ్చిన పరపురుషుడితో మాట్లాడటం రాములమ్మకు అదే మొదటిసారి.... ఆమె మనసు ఉద్వేగంగా ఉంది.

"రాములమ్మా! నీకు కళ్ళు లేకపోయినా ఎంతో బాగున్నావు... చక్కని చుక్కలా ఉన్నావు... మంచి మొగుడ్ని చూసి మనువాడు" అంటూ రిక్షా తొక్కుకుని వెళ్ళిపోయాడు చిన్నారావు.

అప్పటి నుంచి రాములమ్మ హృదయంలో చిన్నారావు తిష్టవేశాడు. పుట్టుగుడ్డి అయినప్పటికీ తనను కలల రాకుమారిగా ఊహించుకుంది.

చిన్నారావు పరిస్థితి కూడా అదే విధంగా ఉంది.

'రాములమ్మను మనువాడాలి! తన ఇల్లాలిని చేసుకోవాలి!' అనుకున్నాడు.

ఆ రూటులో చిన్నారావు బెల్లు వినిపిస్తే రాములమ్మ తడుముకుంటూ ఇంటి బైటికి వచ్చేసేది.... "ఏం రాములమ్మా! భోజనం చేశావా?" అంటూ పలకరించుకుంటూ ముందుకు సాగిపోయేవాడు.

ఓ రోజు రాములమ్మ ఒంటరిగా కనిపించినప్పుడు చిన్నారావు తన మనసు విప్పాడు. "నన్ను పెళ్ళాడటం ఇష్టమేనా?" అడిగాడు.

రాములమ్మ నోటి వెంట మాట రాలేదు.

మొదట నమ్మలేకపోయింది.

కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

"చిన్నారావూ! నువ్వు ఎలాగుంటావో నాకు తెలీదు.... నీది మాత్రం మా పెద్ద మనసయ్యా!" దుఃఖంతో మాట్లాడలేకపోయింది. "నీ రూపంలో దేముడే వచ్చాడనుకుంటాను..." అంటూ అంగీకారం తెలిపింది.

ఆ తర్వాత రిక్షా ఎక్కించుకున్నాడు.

దూరంగా జంగిడితో పూలు అమ్మే కుర్రాడి దగ్గర రిక్షా ఆపి మూరెడు మల్లెపూలు కొన్నాడు. రోడ్డు పక్క బడ్డీలో పకోడి పొట్లం కొని అందించాడు.

ఆ తర్వాత తన ఇంటిలో వారికి చెప్పాడు. "గుడ్డిదాన్ని పెళ్ళి చేసుకుంటావేం... నీకు కాలు వంకరా కన్ను వంకరా!" అన్నారు.

చిన్నారావు వినిపించుకోలేదు.

రాములమ్మ ఇంటికి వెళ్ళి మాట్లాడాడు. అసలు పెళ్ళే కాదనుకున్న రాములమ్మను కోరుకుంటూ వచ్చిన సంబంధం. రాములమ్మ తల్లిదండ్రులను ఎంతో సంబర పరిచింది. చిన్నారావు మంచితనాన్ని అందరూ మెచ్చుకున్నారు.

దొవాడలో అందరి సమక్షంలో చిన్నారావు రాములమ్మల పెళ్ళి నిరాడంబరంగా జరిగింది.

ఇది 1986లో సంగతి.

***

ప్రస్తుతం కూర్మన్నపాలెం సమీపంలో

రాసాలయ్య కాలనీ వద్ద పూరిగుడిసెలో చిన్నారావు కుటుంబం నివసిస్తోంది.

చిన్నారావు రిక్షా అమ్మేశాడు.

కూలిపనికి కుదిరాడు.

1990లో వారికి పుట్టిన గంగాదేవికి ఇప్పుడు పదమూడేళ్ళు. తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటోంది.

ఉదయాన్నే పనికిపోయే చిన్నారావు ఏ రాత్రికో అలసిపోయి ఇంటికి చేరతాడు. అతనికి కారేజి కట్టి ఇవ్వడం... వచ్చిన తర్వాత రాత్రి భోజనం తయారు చేయడంతో రాములమ్మ కాలాన్ని వెళ్ళదీస్తోంది.

రాములమ్మ ఎప్పుడు బైటికి వెళ్ళాలన్నా భర్త చిన్నారావు, కూతురు గంగాదేవి వెంట ఉండాల్సిందే.

గంగాదేవి అయిదవ తరగతి వరకూ చదువుకుంది... ఆర్థిక స్తోమత లేక చదువును ఆపేసి తల్లికి చేదోడు వాదోడుగా ఉంటోంది.

ఇన్నేళ్ళు అయిపోయినా వారి సంసారంలో అపశ్రుతులు లేవు.. అనురాగ వీచికలే తప్ప.

అప్పుడప్పుడు రాములమ్మ అడుగుతుంది "మావా ఈ గుడ్డిదాన్ని కట్టుకున్నానని ఎప్పుడైనా బాధపడుతుంటావా?"

చిన్నారావు వెంటనే గసురుకుంటాడు 'నోరుముయ్యి. అలాంటి మాటలొద్దు... నీ కళ్ళల్లో వెలుగు లేకపోవచ్చు. ఈ ఇంటికి మాత్రం దీపానివి నీవే...!" అంటాడు.

ఆ మాటలు వింటూ ఆమె పొంగిపోతుంది.

ఎన్ని జన్మలకైనా చిన్నారావే తన భర్త కావాలని మనసులో భగవంతుడ్ని మొక్కుకుంటుంది. చుట్టూ ఎవరూ లేరనుకుని ఒకోసారి పైకే ప్రార్థనలు చేసేస్తుంది.

అలాంటప్పుడు చిన్నారావు ఆమెను ఆర్తిగా దగ్గరకు తీసుకుంటాడు..." నేనే కాదు.. జన్మజన్మలకూ నువ్వు నాకు తోడుండాలే!" అంటాడు.

ఆ సమయంలో రాములమ్మ అతడి గుండెలపై గువ్వలా ఒదిగిపోతుంది. ◆

నిర్ణయం

(19వ పేజీ తరువాయి)

పెట్టగలను. పెట్టితీరుతాను" విసురుగా అనేసి బైటికొచ్చేసింది. తనకాస్త సపోర్ట్‌గా ఉంటుందని ఆశపడ్డ సునంద అలా మాట్లాడటంతో శాంతికి పిచ్చెక్కినట్లయింది. మహిళా సంఘాల వాళ్ళను పిలుచుకొస్తే, స్త్రీ ఉద్యమకారుల్ని పిలిస్తేనో, కాలేజీ స్టూడెంట్స్‌ని పిలిచి ఉద్యమం చేస్తేనో, ఇలా రకరకాలుగా ఆలోచిస్తూనే ఉంది. కానీ ఆమెకి ఏం చేయాలో తోచలేదు. నిజానికి సమస్య సమాజానికి సంబంధించిందే. కానీ ఎవరికి వాళ్ళు అది వ్యక్తిగత సమస్య అంటూ ఎవరినీ కల్పించుకోనివ్వటం లేదు. కట్నాల సమస్య కూడా సమాజానికి సంబంధించిందే. కాని అది కూడా వ్యక్తిగత సమస్య అని పోలీసులు కూడా కల్పించుకోవడం లేదు. ఎలా? ఎలా ఈ సమాజం మారేది.

శాంతి ఆలోచనల్లో ఉండగానే, ఆ భయంకర క్షణం రానే వచ్చింది. భారతికి మొహం నిండా పసుపు రాసి, పెద్ద కుంకుమ బొట్లు పెట్టారు. చేతుల నిండా గాజులేశారు. పచ్చచీర కట్టబెట్టారు. విరబోసిన జుట్టుతో, గుండెలు పగిలేలా ఏడుస్తున్న భారతిని, ఆ దౌర్భాగ్యురాల్ని, ఆ నిస్సహాయురాల్ని, అదే జాతికి చెందిన మరికొందరు స్త్రీలు బలవంతంగా బైటికి తీసుకొచ్చారు. చీర చెంగుతో మొహం కప్పుకుని రోదిస్తున్న భారతిని చూస్తుంటే శాంతి రక్తం కుతకుత ఉడికిపోయింది.

ఎంత మోటుదనం? వీటినా సంప్రదాయాలనేది ? ఇవేనా ఆచారాలు ? రాజారామ్మోహన్ రాయ్ ఎక్కడ? వీరేశలింగం ఎక్కడ. మీరంతా ఎక్కడ? మీ బోధనలతో మారిన సమాజం ఇది. చూడండి

రండి. ఈ ఘోరాన్ని ఆపండి. ఆ నిస్సహాయురాల్ని కాపాడండి. సతీసహగమనం రూపుమాపమన్నారే. ఇంతకన్నా అదే నయం కాదా? ఒక స్త్రీని భర్త పోయిన దుఃఖంతో ఉన్నతోటి స్త్రీని ఇలా చిత్రవధ చేయడం నేరం కాదా? అయితే దీనికి శిక్ష నడిబజార్లో ఉరి వేయటమే. రండి. వీళ్ళందరినీ ఉరి తీయండి. పుట్టకతో సంపాదించుకున్న హక్కుల్ని నేలరాచి, చిత్రహింసల పాలు చేసే ఈ సంప్రదాయాన్ని ముక్కలు చేయండి. స్వార్థంతో, అసూయతో, అమానుషత్వంతో ఇంకా ఇలాంటి దురాచారాన్ని ఆచరించే ఈ సమాజాన్ని తగలబెట్టండి. రండి వీరేశలింగం గారూ, రాజారామ్మోహన్‌గారూ! బతికిరండి.

శాంతికి ఉప్పెనలా దుఃఖం ముంచుకొచ్చింది.

నడిబజార్లో ఒక స్త్రీని ఎంత ఘోరంగా అవమానిస్తున్నారు. ఇంతకన్నా దారుణం ఇంకోటుందా? ఈ సమాజానికి సిగ్గుందా? ఒక జీవితాన్ని సంప్రదాయాలకు వేలం వేస్తోంటే చూస్తూ ఊరుకునే ఈ సమాజానికి ఆత్మగౌరవముందా?

శాంతి ఇంక తట్టుకోలేకపోయింది. ఆమెలో ఆ ఆవేశం ఎక్కడనుంచి వచ్చిందో, విసురుగా వెళ్ళి అడ్డొచ్చిన వాళ్ళని తోసేస్తూ, భారతి చేయి పట్టుకుని లాక్కొచ్చి, తన గదిలో పడేసింది. అదే ఆవేశంతో తలుపులు గడియ వేసి అడ్డంగా నిల్చుంది.

"శాంతమ్మా! తలుపు తెరూ శాంతమ్మా అది తప్పు'' అని అరుస్తూ జనం తలుపు తడుతున్నారు. భయంతో బిగుసుకుపోయి, హఠాత్తుగా ఏం జరిగిందో, తెలుసుకున్న భారతి విహ్వలంగా పిలిచింది.

"శాంతక్కా ఏ... ఏవిటిది?"

శాంతి జవాబు చెప్పలేదు. కళ్ళు మూసుకుని తలుపు కానుకుని అలాగే నిలబడింది. బైట నుంచి ఇంకా జనం అరుస్తూనే ఉన్నారు. ◆

ఐరావతం...!

✻ కొండబాబు

కామేశం ఉద్యోగం వచ్చేపాటి చదువుకున్నాడు. అంతే... అతని కష్టం. కాళ్ళావేళ్ళా పడి, ఉత్తర, దక్షిణాలు సమర్పించి ఉద్యోగం వేయించాడు వాళ్ళ నాన్న.

ఉద్యోగం ఉన్న కుర్రాడని వాళ్ళ మామ దండిగా ఇచ్చాడు. అల్లుడు ఉద్యోగం చేస్తున్న ఊళ్ళో చిన్న ఇల్లు కొన్నాడు. బండి సరేసరి.

కొత్త ఇంట్లో నివాసం. కొత్త భార్యతో కొత్త బండిపై షికార్లు... ఇదీ అతగాడి కొత్త జీవితం.

ఒక ఆదివారం సాయంత్రం కామేశాన్ని వెతుక్కుంటూ అతడి కజిన్ పరమేశం వచ్చాడు. అతగాడికి కామేశంలాంటి "మామాధారిత జీవులం"టే కాస్త ఎలర్జీ.

ఎంచక్కా పకోడీలు తింటూ కూర్చున్న కామేశాన్ని చూడగానే.

"ఆహాఁ కొత్త ఇల్లు... కొత్త బండి... కడుపు నిండా తిండి..." నీపాలిట మీ మామగారొక కామధేనువురా అంటూ వెటకారం చేయబోయాడు పరమేశం.

ఇలాంటి వెటకారాలను తేలిగ్గా విదిల్చేసుకోగలడు కామేశం.

"ఆగాగు... కొత్త ఇల్లు అన్నావు సరే... అది కొత్తబండి కాదురా బాబూ... నా పాలిట ఐరావతం. లీటరు పోయిస్తే మీటరు నడుస్తుంది" అన్నాడు.

"ఎక్కువ రేటని..., ఇచ్చేది మామగారు కాబట్టి నువ్వే సెలక్ట్ చేసుకున్నావుగా"

"ఏమేరా... బాబూ... నన్ను షంటటం మానవా... కడుపులో ఎలకలు పరిగెడుతున్నాయ్... కాసిని పకోడీలు తిననీ... నువ్వూ తిను" అన్నాడు.

"హాఁ" పరమేశం నిట్టూర్పు

***

ఐరావతం, కామధేనువు వంటివి కూడా జంతు సంబంధ జాతీయులే. కాకపోతే ఈ రెంటికీ కూడా 'పురాణ ఫ్లేవర్' ఉంది. ఐరావతం అనేది ఒక తెల్లని ఏనుగు పేరు. ఇది ఇంద్రుడి వాహనం. కామధేనువు అనేది ఒక ఆవు పేరు. ఇది స్వర్గంలో ఉంటుందిట. ఎవరికి ఏమి కావాలంటే అవి ఇస్తుంది.

పాల సముద్రాన్ని చిలికేప్పుడు పుట్టిన వాటిలో ఇవీ ఉన్నాయనేది పురాణాల కథనం.

ఐరావతానికి పెద్ద పనేమీ ఉండదు. ఎప్పుడూ తిని, తొంగుండే ఇంద్రుడు దీనిపై ఎక్కి యుద్ధానికెళ్ళేది అరుదు. కాబట్టి దీనికీ పని ఉండదు. కాని దీని ఆహారం కోసం మాత్రం ఎక్కువ వెచ్చించాలి. ఏనుగు కదా మరి.

కాబట్టి పని చేయక, తిండిమాత్రం దండిగా తినే వారిని, వాటిని 'ఐరావతం' అనంటారు. 'తెల్ల ఏనుగు' అని కూడా అంటుంటారు. కొన్ని ప్రముఖ దేవాలయాల్లో 'పవిత్రత', 'దైవ స్వరూపం' పేరుతో ఏనుగులుంటాయి. వీటిని మేపడానికి ఖర్చు ఎక్కువ. పనేమీ ఉండదు. కాబట్టి... వీటినీ ఆ బాపతుగానే చూస్తారు.



మన అవసరాలకు ఆదుకునే వ్యక్తులను, సంస్థలను 'కామధేనువు' అని అంటారు. కావలసినవన్నీ ఇస్తారన్న ఉద్దేశం. 'అతగాడికి వాళ్ళమామగారొక కామధేనువు' అని అంటుంటారు మామ మీద ఆధారపడే వారినుద్దేశించి. ఇక... 'కడుపులో ఎలకలు పరుగెత్తడం' అంటే ఆకలి వేయడమని అర్థం. ఎలకలకూ, కడుపులో ఆకలికి ఏమిటి సంబంధమనేది ప్రశ్న. కడుపు ఖాళీగా ఉన్నప్పుడే కదా ఆకలి వేస్తుంది. ఖాళీ కడుపంటే ఖాళీ పేగులు. ఎలుక కలుగుల్లా ఖాళీగా ఉండే పేగుల్లో ఎలుకలు పరుగెత్తుతాయా? కాబోసు. ఎలుకలు పరుగెత్తుతుంటే వాటిని పిల్లులు వెంట తరుముతాయి కదా! ఇదంతా నిజమా? కాదు. ఖాళీగా ఉన్న పేగులు అరుస్తాయి కదా! 'పేగులు అరుస్తున్నాయి' అని కూడా అంటాం. అరిస్తే వచ్చే శబ్దం ఎలుకలు పరుగెత్తడాలు, పర్యవసానాలు లాంటివని.

'మొసలి కన్నీరు' కార్చడమనే దానికి అర్థం చాలా మందికి తెలుసు. ఎవరైనా మనస్ఫూర్తిగా, సాయం చేసే ఉద్దేశంతో కాక పైపైన, నలుగురికోసం సానుభూతి చూపించారనిపిస్తే... వారిని 'మొసలి కన్నీరు కార్చాడు' అని విమర్శిస్తారు. మొసలికి ఈ ఉత్తుత్తి సానుభూతికి సంబంధమేమిటి? మొసలి కళ్ళవెంట తరచూ నీరు వస్తుంది. ఇది చూసి మొసలి బాధపడుతోందనుకుంటే పొరపాటే. అది బాధకాదు. దాని తీరు అది. కాబట్టి... సానుభూతి నటించే వారికి, ఉత్తుత్తిగా కన్నీరు కార్చే మొసలితో పోల్చి 'మొసలి కన్నీరు కార్చుతున్నాడు' అంటారు.

ఇంకా 'వంటింటి కుందేలు' అనే జాతీయం గురించి వినే ఉంటారు. పొదల్లో ఉన్న కుందేలు ఎట్టైనా గెంతేయవచ్చు. వంటింటో కప్పెట్టిన కుందేలు ఎటూపోలేదు. కాబట్టి ఎప్పుడైనా వాడుకోవడానికి సిద్ధంగా ఉన్న వారిని 'వంటింటి కుందేలు' అనంటారు. ◆

పాఠక స్పందన

ఉ(బు)డతాది చల్లని మనసు

మే 25వ తేదీ సంచికలో ప్రచురించిన పలుకు'బడి' శీర్షికలో ఉడతాసాయం వ్యాసం చాలా బాగుంది. ఆకలి మంటలతో అల్లాడుతున్న కరువు జనంకోసం పార్టీనాయకులు అంబలి కేంద్రాల కోసం బిక్షాటన చేస్తుండగా తండ్రి చెప్పిన మాటలు పాపాయి అర్థం చేసుకొని ఐస్‌క్రీం కొనుక్కోవాల్సిన డబ్బులు నాయకుడి జోలెలో వేసింది. ఈ పాపాయిని ప్రతి ఒక్కరూ అభినందించాలి.

– **మామిండ్ల రమేష్ రాజా**, పాలకుర్తి, వరంగల్ జిల్లా

'వ్యక్తిత్వం వికాసం లేని చదువు వ్యర్థం'

మే 25 సంచికలో బాలవికాసం శీర్షికలో 'విద్య స్ఫూర్తినివ్వాలి' అనే వ్యాసం ర్యాంకుల కోసం హైరానా పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకిది కనువిప్పు కలిగించేదిగా ఉంది. కార్టూన్ కదంబం బాగుంది.

– పినాకిని, డి.వి.రెడ్డి, గవరపాలెం, అనకాపల్లి

కళాసాహితి బాగుంది

18 మే 2003 ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో కళాసాహితి శీర్షికన ప్రచురించిన 'పిట్టకొంచెం మేజిక్ ఘనం' చాలా ఆనందాన్నిచ్చింది. చిన్నారి మేజిక్ ఎంతో హృదయానందకరంగా, వైవిధ్య భరితంగా తనదైన మేజిక్ బాణిలో రకరకాల ప్రదర్శనల ద్వారా తెలియపరిచిన చిన్నారికి ఇవే నా అభినందనలు.

– **మేడూరి సత్యనారాయణ**, తిరువూరు, కృష్ణాజిల్లా

జీవితం లేని 'జీవనశైలి'

జీవనశైలిలో దినదినం జీవితం లేకుండా పోతోంది. ఈ శీర్షిక మొదట్లో చాలా ఆకర్షణీయంగా, ఉద్బోధించేదిగా ఉండేది. ఈ మధ్యకాలంలో ఇది కేవలం 'అంపశయ్య నవీన్ ఆత్మకథ'లా తయారయ్యింది. ఎంతో సీనియర్ రచయిత అయిన నవీన్ గారు ఈ విధంగా ఎందుకు రాస్తున్నారో అర్థం కావడం లేదు.

– **అప్పలనాయుడు**, విశాఖపట్నం

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

SGPS

శ్రీ గౌతమి
పబ్లిక్ స్కూల్

L.K.G. to 10th Class

గాంధీపురం - 3, రాజమండ్రి - 3,

ఫోన్స్ : 2463533, 2468971

బ్రాంచ్ : ఇ.ఎస్.ఐ. హాస్పిటల్ ఎదురుగా, శ్రీరామనగర్, రాజమండ్రి,

ఫోన్ : 5568523